జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | బుధవారం 26 ఫిబ్రవరి 2025 | సంపుటి : 15 | సంచిక : 178 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



## గత ఆరేళ్ల బీజేపీ పాలనలో అసోం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయింది

- తూర్పు, ఈశాన్య ప్రాంతాలు దేశం భవిష్యత్తులో కొత్త ప్రయాణానికి శ్రీకారం
- ఇక 2018లో అడ్వాంటేజ్ అసోం సదస్సు నిర్వహించారు
- దేశ పురోగతికి అసోం రాష్ట్ర సహకారం క్రమక్రమంగా పెరుగుతోంది
- అసోం బిజినెస్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

## ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది

# మేం కాదు.. ప్రజలు



- ప్రతి హామీని అమలు చేసి తీరుతాం
- పథకాల అమలుపై సీఎం కీలక ప్రకటన..
- తల్లికి వందనం పథకం మే నెలలో అమలు చేస్తాం
- ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను పెంచాం
- ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికి సమయానికి జీతాలు ఇస్తున్నాం,
- పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ
- గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం
- ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.

**ప్రజాజ్యోతి అమరావతి**

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. " వైకాపా హయాంలో జరిగిన సభ కౌరవ సభ. కౌరవసభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశా. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదు. సంప్రదాయాలను మరిచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా? ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదు.. ప్రజలు. నిన్న వైకాపా నేతలు కేవలం 11 నిమిషాలే సభలో ఉన్నారు. "త్వరలో రైతు భరోసా అమలు చేస్తాం. రైతు భరోసా కింద కేంద్రం, రాష్ట్రం కలిసి రూ.20వేలు ఇస్తాం. మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకురూ.20వేలు అందిస్తాం. ఇచ్చిన హామీ మేరకు - మిగతా3లో



## ఎన్ని ఇబ్బందులు వచ్చినా

# కలిసే ఉంటాం

- "ఎన్డీయే సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు
- వైకాపా నేతల తీరుపట్ల.. గవర్నర్‌కు మేం క్షమాపణలు చెబుతున్నాం
- మా తప్పు లేకున్నా గవర్నర్‌కు క్షమాపణలు చెబుతున్నాం.
- అసెంబ్లీలో వైకాపా విధ్వంసం చూస్తే.. వివేకా హత్య గుర్తొచ్చింది: పవన్
- "వైకాపా నేతలు గొడవలు, బూతులకు పర్యాయ పదంగా మారిపోయారు
- ఇలాంటి నేతలను ఇన్ని సంవత్సరాలుగా చంద్రబాబు ఎలా తట్టుకుని నిలబడగలిగారా? అని.. నిన్నటి ఘటన తర్వాత నాకనిపించింది.
- అలాంటి వారిని ఎదుర్కోవాలంటే ఎంతో ధైర్యం, తెగువ ఉండాలి

**ప్రజాజ్యోతి అమరావతి:**

అసెంబ్లీలో వైకాపా నేతల విధ్వంసం చూస్తే.. వివేకా హత్య గుర్తొచ్చిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గవర్నర్ ప్రసంగిస్తుంటే వైకాపా నేతలు అలా ప్రవర్తించవచ్చా అని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా పవన్ మాట్లాడారు. "వైకాపా నేతలు గొడవలు, బూతులకు పర్యాయ పదంగా మారిపోయారు. ఇలాంటి నేతలను ఇన్ని సంవత్సరాలుగా చంద్రబాబు ఎలా తట్టుకుని నిలబడగలిగారా? అని.. నిన్నటి ఘటన తర్వాత నాకనిపించింది. - మిగతా3లో

## ఇంటర్నెట్ షట్‌డౌన్‌లో ఇండియా ఫస్ట్!

యాక్సెస్ నౌ నివేదికలో వెల్లడి

సైనిక దేశాల్లో మయన్మార్ టాప్



## అరగంటలో 350 కిలోమీటర్ల జర్నీ!

- హైపర్‌లూప్ అనేది అత్యంత అధునాతనమైన రవాణా వ్యవస్థ
- గంటకు వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం ఈ రవాణా వ్యవస్థ లక్ష్యం
- సుదుర గమ్యాలను నిమిషాల వ్యవధిలో చేరుకునేలా చేయడమే దీని ఉద్దేశం.
- ఐఐటీ మద్రాస్ ఆలోచనతో భారత తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ సిద్ధమైంది.




## వాస్తవాలకు విరుద్ధంగా

# గవర్నర్ ప్రసంగం

- మంత్రి నారా లోకేశ్‌పై బొత్స ఆగ్రహం
- అమ్మ ఒడి, రైతు భరోసా ఎగ్గొట్టడం సుపరిపాలన అవుతుందా.?"
- గవర్నర్ ప్రసంగంలో దశ లేదు, దిశలేదు .. మీడియాతో బొత్స
- ప్రజా వ్యతిరేక, ప్రజలకు మేలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉంది.



**ప్రజాజ్యోతి అమరావతి:**

గవర్నర్ ప్రసంగంపై చర్చలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఎమ్మెల్సీ వరుద కళ్యాణి ప్రసంగాన్నిఅడ్డుకునేందుకు మంత్రులు ప్రయత్నించారు. ఆమె ప్రసంగాన్ని మంత్రి నారా లోకేష్ అడ్డుకున్నారు. నాలుగు లక్షల ఉద్యోగాలు చెప్పలేదంటూ మంత్రి నారా లోకేష్ వాదించారు. గవర్నర్ ప్రసంగంలో కల్పించినట్టు రాశారని వరుదు కళ్యాణి అన్నారు. తాము ఇంగ్లీష్ స్పీచ్‌లో ఉన్నదే చెప్తామంటూ మంత్రి లోకేష్ వితండ వాదం చేశారు. మంత్రులు మాటిమాటికీ అడ్డు తగలడంపై విపక్ష నేత బొత్స అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రుల తీరుపై బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఉద్యోగాలు ఇచ్చేశాం అని ఎలా చెప్తారంటూ బొత్స అభ్యంతరం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం టీడీపీ, జనసేన పై ఆధారపడి ఉన్నా ప్రత్యేక హోదా సాధించలేదన్న వరుదు కళ్యాణి వ్యాఖ్యల పట్ల మంత్రి - మిగతా3లో

# ఇంటర్నెట్ షట్‌డౌన్‌లో ఇండియా ఫస్ట్!




ఇంటర్నెట్ షట్‌డౌన్‌లో ఇండియా వరుసగా ఆరో ఏడాది టాప్‌లో నిలిచింది. ఎక్కువసార్లు ఇంటర్నెట్ సేవలు నిలిపివేసిన ప్రజాస్వామ్య దేశాల్లో మనమే ముందున్నాం. డిజిటల్ హక్కుల సంస్థ యాక్సెస్ నౌ తాజా నివేదిక ప్రకారం.. గతేడాది అంటే 2024లో వేర్వేరు కారణాలతో మనదేశంలో 84 సార్లు ఇంటర్నెట్ ఆపేశారు. అయితే 2023తో పోల్చుకుంటే భారత్‌లో ఇంటర్నెట్ షట్‌డౌన్లు బాగా తగ్గాయి. 2023లో 116 సార్లు ఇంటర్నెట్ ఆపేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాలు ఉన్న 54 దేశాల్లో గతేడాది 296 పర్యాయాలు ఇంటర్నెట్ సేవలపై షట్‌డౌన్ విధించడం జరిగింది. 2023లో 39 దేశాల్లో 283 సార్లు ఇంటర్నెట్ నిలివేసిన ఘటనలు నమోదయ్యాయి.

భారత్ కంటే మయన్మార్‌లో ఎక్కువ సార్లు ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు. 2024లో అక్కడ 85 పర్యాయాలు ఇంటర్నెట్ బంద్ చేశారు. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం ఉందన్న విషయం మనందరికీ గుర్తుండే ఉంటుంది. అందుకే అక్కడ పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక మన దాయాది దేశం పాకిస్థాన్‌లో 21 సార్లు ఇంటర్నెట్ నిలిపివేసింది. ఆ దేశ చరిత్రలో ఇన్నిసార్లు ఇంటర్నెట్ షట్‌డౌన్ చేయడం ఇదే ప్రథమం. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా 19 పర్యాయాలు ఇంటర్నెట్ రాకుండా చేసింది. ఇందులో ఏడు సార్లు ఉక్రెయిన్‌లోనే ఇంటర్నెట్ ఆపేసింది. యుద్ధం, హింసాత్మక ఘటనల కారణంగా 2024లో ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల్లో 103 సందర్భాల్లో ఇంటర్నెట్ బంద్ చేశారు.

**మణిపూర్‌లో అత్యధికం**

మనదేశంలో గతేడాది కేంద్రపాలిత ప్రాంతాలతో సహా 16 రాష్ట్రాల్లో కనీసం ఒకసారైనా ఇంటర్నెట్‌ను నిలిపివేయడం జరిగింది. కల్లోలిత మణిపూర్‌లో అత్యధికంగా 21 పర్యాయలు ఇంటర్నెట్ సేవలను ఆపేశారు. హరియాణా(12), జమ్మూకశ్మీర్(12) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆందోళన కార్యక్రమాలతో 41 సార్లు, మతఘర్షణలతో 23 సార్లు, ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల సమయంలో ఐదు పర్యాయాలు ఇంటర్నెట్ నిలిపివేశారు. తరచుగా ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిజిటల్ గవర్నెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు ఇలాంటి చర్యలు విఘాతం కలిగిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత దేశం ఇటీవల ప్రవేశపెట్టిన టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023,టెలికాం సస్పెన్షన్ రూల్స్ 2024 గురించి కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయానికి గల కారణాలను సమీక్షించడానికి చట్టంలో స్వతంత్ర పర్యవేక్షణ యంత్రాంగాలు లేవని విమర్శకులు వాదించారు. కూడా ఆయన నివేదిక ఆందోళనలను లేవనెత్తింది, ఇది 1885 టెలిగ్రాఫ్ చట్టం నుండి వలసరాజ్యాల కాలం నాటి నిబంధనలను నిలుపుకుంది. షట్‌డౌన్ ఆర్డర్‌లను సమీక్షించడానికి చట్టంలో స్వతంత్ర పర్యవేక్షణ యంత్రాంగాలు లేవన్న విమర్శలు బలంగా వినిపించాయి.

## అరగంటలో 350 కిలోమీటర్ల జర్నీ!




**న్యూఢిల్లీ:** ఢిల్లీ నుంచి జైపూర్(రాజస్థాన్) మధ్య దూరం 300 కిలోమీటర్లు ఉంటుంది. అంతటి దూరాన్ని నిమిషాల్లో చేరుకోగలిగితే ఎలా ఉంటుంది?.. ఇలాంటి హైస్పీడ్ ప్రయాణం కోసం కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ తొలి అడుగు వేసింది. ఐఐటీ మద్రాస్ ఆలోచనతో భారత తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ సిద్ధమైంది. హైపర్‌లూప్ అనేది అత్యంత అధునాతనమైన రవాణా వ్యవస్థ. గంటకు వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం ఈ రవాణా వ్యవస్థ లక్ష్యం. సుదుర గమ్యాలను నిమిషాల వ్యవధిలో చేరుకునేలా చేయడమే దీని ఉద్దేశం. అందుకే దీన్ని రవాణా వ్యవస్థలో హైపర్‌లూప్‌ను గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్నారు. వందేభారత్ తర్వాత బుల్లెట్ రైల్ మీద దృష్టిసారించిన భారతీయ రైల్వే ఇప్పుడు మరో ఘనత వైపు అడుగులేస్తోంది. భారత తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలియజేశారు. ఐఐటీ మద్రాస్ సహకారంతో 422 మీటర్ల దూరం ఉన్న ట్రాక్‌ను రూపొందించారు. ఈ హైపర్‌లూప్ ప్రాజెక్టు వాస్తవరూపం దాలిస్తే అరగంటలోపే ఢిల్లీ నుంచి జైపూర్‌కు చేరుకోవచ్చన్నమాట. రోడ్డు, రైలు, నీరు, వాయు రవాణా మార్గాల తర్వాత ఫిఫ్త్ ట్రాన్స్‌పోర్టేషన్‌గా హైపర్‌లూర్‌ను చెబుతుంటారు. వాక్యూమ్ ట్యూబ్స్‌లో పాడ్స్ ద్వారా ప్రయాణమే హైపర్‌లూప్. గొట్టాల్లాంటి ఆ నిర్మాణాల్లో గాలి నిరోధకత.. పాడ్‌లను అధిక వేగంతో ప్రయాణించేలా చేస్తుంది. 2013లో ఇలాన్ మస్క్ ప్రచారంతో దీని గురించి ఎక్కువ చర్చ నడిచింది. అమెరికా, చైనా ఇలా చాలా దేశాలు ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాయి. ప్రధాన నగరాలను అనుసంధానించడం కోసమైనా హైపర్‌లూప్ టెక్నాలజీ వినియోగంలోకి తేవాలని యూఏఈ సైతం భావిస్తోంది.

# గత ఆరేళ్ల బీజేపీ పాలనలో అసోం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయింది



**గౌహతి :** అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వ శర్మ పాలనలో అసోం రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గత ఆరేళ్ల బీజేపీ పాలనలో అసోం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయిందన్నారు. ఆ విధంగా దేశ పురోగతికి అసోం రాష్ట్ర సహకారం క్రమక్రమంగా పెరుగుతోందని తెలిపారు. మంగళవారం రాజధాని గౌహతిలో అడ్వాంటేజ్ అసోం 2.0 బిజినెస్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. తూర్పు, ఈశాన్య ప్రాంతాలు దేశం భవిష్యతులో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టాయన్నారు. అందులోభాగంగా అసోం పురోగతి.. ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలుస్తోందన్నారు. ఇక 2018లో అడ్వాంటేజ్ అసోం సదస్సు నిర్వహించారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఆ సమయంలో ఈ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి విలువ రూ. 2.75 లక్షల కోట్లు ఉండగా.. నేడు అది రూ. 6 లక్షల కోట్లకు చేరుకొందని ప్రధాని నరేంద్ర మోదీ గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు.

అలాగే బీజేపీ పాలనలో జరిగిన అభివృద్ధిని సైతం ఆయన విపులీకరించారు. 2014కు ముందు అసోంలోని బ్రహ్మపుత్ర నదిపై మూడు బ్రిడ్జిలు మాత్రమే ఉండేవని. కానీ గత పదేళ్లలో ఈ నదిపై నాలుగు కొత్త బ్రిడ్జిలు నిర్మించామని తెలిపారు. ఇక గత యూపీఏ హయాంలో అంటే.. 2009 నుంచి 2014ల మధ్య అసోంకు రూ. 2,100 కోట్ల మేర రైల్వే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే.. ఎన్డీయే ప్రభుత్వ పాలనలో ఆ కేటాయింపులు కాస్తా రూ.10 వేల కోట్లుకు చేరుకుందని ప్రధాని మోదీ చెప్పారు. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన అసోంలో వివిధ మార్గాల్లో విమాన సర్వీసులు సైతం భారీగా పెరిగాయన్నారు. గతంలో యూపీఏ హయాంలో కేవలం 7 మార్గాల్లోనే విమానాలు నడిచేవని.. కానీ ప్రస్తుతం 30 మార్గాల్లో విమాన సర్వీసులు నడుస్తున్నాయని ప్రధాని మోదీ సోదాహరణగా వివరించారు. భారత్‌లో దాదాపు 50 శాతానికి పైగా సహజ వాయువు అసోం నుంచే లభిస్తోందని గుర్తు చేశారు. దీంతో ఈ రాష్ట్రంలోని రిఫైనరీల కెపాసిటీని గణనీయంగా పెంచామన్నారు.

అలాగే రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, గ్రీన్ ఎనర్జీ తదితర రంగాలు దూసుకు పోతున్నాయని తెలిపారు. పశ్చిమ భారతావనిలో అసోం అతిపెద్ద తయారీ హబ్‌గా మారేందుకు మరెంతో కాలం పట్టదని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకోసం అసోంకు కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో అసోం ఆర్థికంగా పురోగమించిందని తెలిపారు. అందుకు తేయాకు, సహజ వాయువులు, హైడ్రోకార్బన్ పుష్కలంగా ఉండేవని.. ఆ యా రంగాల నుంచి వచ్చే ఆదాయం కారణంగా.. జాతీయ ఆర్థికాభివృద్ధిలో అది 4 శాతంగా ఉండేదన్నారు. ఈ సమ్మిట్‌కు టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, రిలయన్స్ సంస్థ సీఎండీ ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదాని, వేదాంత సంస్థ గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్‌తోపాటు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ సీఎండీ సజ్జన్ జిందాల్ తదితరులు హాజరయ్యారు. అలాగే పలువురు కేంద్ర మంత్రులు, వివిధ దేశాల రాయబారులతోపాటు దాదాపు 60 దేశాలకు చెందిన ప్రతినిధులు సైతం ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు.

## నయవంచన ఎక్కువ కాలం సాగదు..



మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నాడీఎంకే వరుస ఓటములు చవిచూడటానికి ఆ పార్టీలో కొనసాగుతున్న ఏక నాయకత్వమే కారణమని తమిళనాడు మరో మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం అన్నారు. జయ లలిత జయంతి సందర్భంగా మెరీనాబీచ్ కామరాజర్ రోడ్డులో ఉన్న ఆమె విగ్రహానికి పన్నీర్ సెల్వం నివాళులు అర్పించారు. తన అనుచరులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పన్నీర్ సెల్వం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా మళ్ళీ జయ పాలన రావాలని కోరుకుంటున్నారని, ఆమె బ్రతికున్నంతకాలం పార్టీని ఉన్నతస్థితికి చేర్చారని అన్నారు. ఆ తర్వాత పార్టీలో ద్వంద్వ నాయకత్వం ఉన్నప్పుడు బలం బాగా పుంజుకుందని చెప్పారు. ఇప్పుడు ఏక నాయకత్వం వచ్చినప్పటి నుంచి పార్టీ ప్రతిష్ట క్రమంగా తగ్గుతూ వస్తోందని అన్నారు. అన్నాడీఎంకే పార్టీలోని సీనియర్ నేతలంతా పార్టీ నాశనమైనా పరవాలేదుగానీ ఏక నాయకత్వమే కావాలని కోరుకుంటున్నారని, ఇది మంచిది కాదని పన్నీర్ సెల్వం చెప్పారు. పార్టీలో నిరంకుశధోరణి పెరుగుతోందని ఆరోపించారు. పార్టీ నుంచి విడిపోయినవారిందరినీ కలుపుకుని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే అన్నాడీఎంకే గెలిచి అధికారంలోకి వస్తుందని అన్నారు. అయితే ఆ దిశగా పార్టీ నాయకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గర్హనీయమని ఓపీఎస్ వ్యాఖ్యానించారు. ఓపీఎస్ వ్యాఖ్యలను పళనిస్వామి తిప్పికొట్టారు. 'తోడేలు, గొర్రె పిల్ల కలిసి సాగుచేస్తే మంచి పంట దిగుబడి వస్తుందా..? నమ్మకస్తుడు, రాజద్రోహి ఒకేచోట ఉండగలరా..? మీరు చెప్పింది జరగడం అసాధ్యం' అని పన్నీర్ సెల్వం పేరును ప్రస్తావించకుండా పళని స్వామి వ్యాఖ్యానించారు. అందుకు పన్నీర్ సెల్వం కూడా పళనిస్వామి పేరును ప్రస్తావించకుండానే.. జయలలితకు అత్యంత నమ్మకస్తుడిని తానేనని, అసలు అన్నాడీఎంకే తనదే అవుతుందని, నీ నయవంచన ఎక్కువకాలం సాగదని కౌంటర్ ఇచ్చారు.

# ఏడాది ముందే నుంచి ఎన్నికల హడావిడి



**చెన్నై :** తమిళనాట ఎన్నికలకు ఏడాది సమయం ఉంది.. అయితే అక్కడ పాలిటిక్స్ ఇంట్రెస్టింగ్ గా మారాయి.. ముగ్గురు బడా సినీ హీరోల వైఖరి ఇందుకు ప్రధాన కారణం.. సూపర్ స్టార్ రజనీకాంత్, విభిన్న కథానాయకుడు కమల్ హసన్, మాస్ హీరో విజయ్? ఈ ముగ్గురు ఒక్కో దారిలో ఉండడం ఇప్పుడు అక్కడ పాలిటిక్స్ ఇంట్రెస్టింగ్ గా మారడానికి కారణం అయ్యాయన్న టాక్ వినిపిస్తోంది. తమిళనాట రాజకీయాలను సినీ పరిశ్రమను వేరు చేసి చూడలేం. దశాబ్దాలుగా అక్కడ రుజువైన అనుభవాలెన్నో? డీఎంకే ని దశాబ్దాలుగా బలమైన పార్టీగా నడిపిన శక్తిగా చెప్పబడే దివంగత కరుణానిధి మొదలు.. అంతటి కరుణానిధి తో విభేదించి సొంత పార్టీని స్థాపించి సక్సెస్ కొట్టిన అప్పటి సంచలన హీరో ఎం.జి.రామచంద్రన్.. కీలక బాధ్యతలు చేపట్టిన జయలలిత ఎంజీఆర్ మరణానంతరం పార్టీని లీడ్ చేసి దశాబ్దాన్నరకి పైగా పార్టీని సక్సెస్ చేయగలిగారు.. ఆ తర్వాత నటుడు విజయ్ కాంత్ కూడా పార్టీని స్థాపించి కొంతమేర తన ప్రభావం చూపగలిగారు.. అయితే దశాబ్దాలుగా సూపర్ స్టార్ రజినీకాంత్ కూడా నేరుగా రాజకీయాల్లోకి వస్తారని బలమైన చర్చ జరిగిన ఆయన మాత్రం రాజకీయాల్లోకి రాలేదు.90వ దశకంలో డీఎంకేకి రజనీకాంత్ మద్దతు ఇచ్చిన సమయంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది.. 2011లో రజనీకాంత్ ఏడీఎంకేకి ఓటు వేస్తూ ఉన్న దృశ్యాలు నిమిషాల్లో వైరల్ గా మారాయి.. ఆ ఎన్నికల్లో తన మద్దతు జయలలిత నేతృత్వంలోని ఏడీఎంకేకు ఇచ్చారన్న సంకేతాలు వెళ్లాయి.. అయితే రాజకీయంగా జయలలితతో నేరుగా రజనీకాంత్ కు ఎప్పుడూ విభేదాలు మాత్రమే చూసిన సందర్భాలు అనేకం ఉన్నాయి.. ఇద్దరి మధ్య చెప్పలేనంత వైరం అనేది ఎప్పుడు ఉండనే ఉండేది.. అవి తమిళనాడు మొత్తం తెలిసిన విషయమే.. 2017లో రజినీకాంత్ పొలిటికల్ ఎంట్రీ దాదాపు ఖాయమని వార్తలు వచ్చాయి అభిమానులతో వరుస సమావేశాలు కూడా జరిగాయి.. కానీ ఉన్నటువంటి రాజకీయాల్లోకి రావడం లేదని ఆయన ప్రకటించిన పరిస్థితిని కూడా చూశాం..రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం లేదన్న ప్రకటన తర్వాత విజయ్ రాజకీయాల్లోకి వస్తారని చర్చ జరిగింది.. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లోకి రావడమూ జరిగింది. నటుడు విజయ్ ఏర్పాటు చేసిన టీవీకె సొంతంగా కూటమిని ఏర్పాటు చేస్తుందా లేదా ఉన్న బలమైన పార్టీలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తుందా అన్నది ప్రస్తుతానికి క్లారిటీ లేదు.. కానీ మొత్తానికైతే మాత్రం రాజకీయాల్లో తానేంటో చూపించాలన్న కసితో మాత్రం విజయ్ రాజకీయం చేస్తున్నట్టు తాజా పరిస్థితులు చెబుతున్నాయి.ఇక విజయ్ కంటే ముందే పార్టీని స్థాపించిన నటుడు కమలహాసన్ 2021లో పోటీ చేసి సత్తా చాటలేదు.. అయినా ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకె కూటమికి కమలహాసన్ మద్దతు ఇచ్చారు.. డీఎంకే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. కమల్ హాసన్ కు డీఎంకే రాజ్యసభ అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.. త్వరలో ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో తొలి స్థానం కమల్ కు ఇచ్చేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.. దీంతో డీఎంకేకి కమలహాసన్ దగ్గరగా ఉండడం అనేది క్లారిటీగా ఉన్న అంశం.ఇక నటుడు రజనీకాంత్ ఒకప్పుడు డిఎంకెకి మద్దతు ఇవ్వడం ఆ తర్వాత తాను వేసిన ఓటు ద్వారా ఏటీఎం కేకే మద్దతుగా ఉన్నానన్న సంకేతాలు ఇవ్వడం ఒకసారి తీవ్రంగా చర్చ జరిగింది. రెండింటికి మించి ప్రధాని నరేంద్ర మోడీతో రజనీకాంత్ కు మంచి సాన్నిహిత్యం ఉంది. ప్రస్తుతం తమిళనాడులో జయలలిత మరణం తర్వాత మూడు ముక్కలుగా చీలిపోయిన ఏడిఎంకేని ఒక తాటిపైకి తెచ్చి కూటమిగా ఏర్పాటు చేసి ఎలాగైనా తమిళనాడులో అధికారం దక్కించుకోవాలనేది బిజెపి వ్యూహంగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా రజనీకాంత్ జయలలిత నివాసానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. జయంతి సందర్భంగా వెళ్లారని చెబుతున్నా.. జయలలిత భౌతికంగా ఉన్నప్పుడు ఎప్పుడూ ఇంటికి వెళ్ళని రజనీకాంత్ ఇప్పుడు వెళ్లడం.. జయలలిత మేనకోడలితో మాట్లాడి జయలలితకు నివాళులర్పించడం అనేది ప్రస్తుతం రాజకీయంగా తీవ్రంగా చర్చ జరుగుతోంది. బిజెపి వేసుకున్న ప్లాన్ లో భాగంగా ఏడిఎంకేలో వివాదాలను దూరం చేసి అందర్నీ కలిపి బిజెపికి కలిసోచ్చేలా రజనీకాంత్ వ్యవహరిస్తున్నారా..? అన్న చర్చ కూడా జరుగుతోంది.డీఎంకేకి సినీ పరిశ్రమ నుంచి కమలహాసన్.. ఇక నటుడు విజయ్ సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకోగా.. రజినీకాంత్ ను ఏడీఎంకే అనుకూలంగా మార్చుకుంటుందన్న డిస్కషన్ కూడా జరుగుతుంది.. తమిళనాడులో ముగ్గురు బడా సినీ హీరోలు తలోదిక్కుగా ఉంటున్న తాజా పరిణామాలు ఇటు తమిళనాడులో.. అటు జాతీయ రాజకీయాల్లో మోస్ట్ ఇంట్రెస్టింగ్ గా మారాయి.

## 2 రోజుల్లోనే రూ. 30,77,000 కోట్ల పెట్టుబడులు



భారతదేశాన్ని తయారీ కేంద్రంగా మారుస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 2 రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ చివరి రోజైన నేడు అమిత్ షా హాజరైన క్రమంలో పేర్కొన్నారు. ఒకప్పుడు మధ్యప్రదేశ్‌ను అనారోగ్య రాష్ట్రాలలో ఒకటిగా లెక్కించారన్న ఆయన, ఇప్పుడు విద్యుత్, రోడ్లు, నీటి పరంగా ఎంపీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో గనులు, ఖనిజాలు కూడా సమృద్ధిగా ఉన్నాయన్నారు. గత 20 ఏళ్లలో 5 లక్షల కిలోమీటర్ల రోడ్లు నిర్మించబడ్డాయని, రాష్ట్రం 25 శాతం పత్తిని కూడా ఉత్పత్తి చేస్తుందన్నారు. దీంతో మధ్యప్రదేశ్ దేశానికి పత్తి రాజధానిగా మారిందన్నారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌తో రూ. 30,77,000 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయని అమిత్ షా ప్రస్తావించారు. రెండు రోజుల్లో రెండు వందలకు పైగా భారతీయ కంపెనీలు, రెండు వందలకు పైగా గ్లోబల్ కంపెనీల %జజుూ%లు, ఇరవైకి పైగా యూనికార్న్ వ్యవస్థాపకులు, యాభైకి పైగా దేశాల ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్ ఆహార ప్రాసెసింగ్‌కు కూడా ఒక ముఖ్యమైన రాష్ట్రంగా పరిగణించబడుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన వారికి మంచి వాతావరణం లభిస్తుందని తాను హామీ ఇస్తున్నట్లు చెప్పారు అమిత్ షా. అంతేకాదు ఎంపీ మన దేశ గొప్ప వారసత్వాన్ని కూడా గుర్తు చేస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. దీంతోపాటు 2047 నాటికి మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో మధ్యప్రదేశ్ ముఖ్యమైన సహకారాన్ని కలిగి ఉంటుందన్నారు. ఈ క్రమంలో భారతదేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని, వివిధ రంగాలలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన విధానాలు భారతదేశాన్ని తయారీ కేంద్రంగా మార్చడంలో సహాయపడతాయన్నారు. ఇక్కడ అభయారణ్యం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి కూడా ఉందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును ఫిబ్రవరి 24న ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇది ఫిబ్రవరి 25న ముగిసింది. దేశంలోని అనేక మంది కీలక పారిశ్రామికవేత్తలు ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు.

# ఎన్ని ఇబ్బందులు వచ్చినా కలిసే ఉంటాం..

-మొదటిపేజీ తరువాయి

ఆయనకు హ్యాట్సాఫ్.. అలాంటి వారిని ఎదుర్కోవాలంటే ఎంతో ధైర్యం, తెగువ ఉండాలి. నిన్న సభలో గొడవ చేసిన వైకాపా నేతలు .. గవర్నర్‌గారు సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు ఆయన కళ్లలోకి చూడగలిగేవారా? చట్టాలు చేయాల్సిన వారే ఉల్లంఘిస్తే ఎలా?

నిన్న సభలో గొడవ జరుగుతుంటే.. వైకాపా విధ్వంస విధానాలు గుర్తొచ్చాయి. ప్రజావేదిక కూల్చివేసిన తీరు, 200 పైచిలుకు ఆలయాలు కూల్చివేత, డాక్టర్ సుధాకర్ చనిపోయిన విధానం, జంగారెడ్డిగూడెం కల్తీసారా మరణాలు, సుప్రీంకోర్టు జడ్జిపై లేఖ రాయడం, హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో విమర్శలు చేయడం, పత్రికాధిపతులపై దాడులు, మడ అడవుల విధ్వంసం, చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టిన విధానం, అమరావతి రైతులను రక్తం వచ్చేట్టు కొట్టి, కేసులు పెట్టిన తీరు, తిరుపతి కల్తీ లడ్డూ ఘటనలు గుర్తొచ్చాయి. అసెంబ్లీలోనే ఈ స్థాయిలో ప్రవర్తిస్తే.. బయట కూడా ఇలాంటి గొడవలే జరుగుతాయి. ఇది మారాలి అని ప్రజలకు



చెబితే.. మనల్ని అత్యధిక మెజార్టీతో ఇక్కడ కూర్చోబెట్టారు" అని పవన్ అన్నారు.

**ఎన్ని ఇబ్బందులు వచ్చినా కలిసే ఉంటాం..**

"ఎన్డీయే సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. వైకాపా నేతల తీరుపట్ల.. గవర్నర్‌కు మేం క్షమాపణలు చెబుతున్నాం. మా తప్పు లేకున్నా గవర్నర్‌కు క్షమాపణలు చెబుతున్నాం. గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడింది. వారి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఒకే రోజు 13,326 గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 1800 కి.మీ సీసీ రోడ్లు వేసింది. మా ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే 4వేల కి.మీకు పైగా సీసీ రోడ్లు వేశాం. 22వేలకు పైగా గోకులాలు నిర్మించాం. గత ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ నిధులు దుర్వినియోగం చేసింది. వైకాపా హయాంలో అటవీశాఖమంత్రి 77 ఎకరాల అటవీభూమి ఆక్రమించారు. రాష్ట్రంలో ఎర్రచందనం కొట్టి తరలిస్తుంటే కర్ణాటక అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆ ఎర్రచందనం వేలం వేస్తే కర్ణాటకకు రూ.185 కోట్ల ఆదాయం వచ్చింది. సీఎం కృషి వల్లే విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకున్నాం. గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్లాట్లు వేసేందుకు సిద్ధపడింది.

సంకీర్ణ ప్రభుత్వం సవాళ్లతో కూడుకున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం నిలబడి ఉన్నాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. 15ఏళ్ల పాటు ఎన్డీయే కూటమి అధికారంలో ఉంటుంది. మేం కలిసి లేకుంటే ప్రజలకు ద్రోహం చేసినట్టే. మమ్మల్ని అగౌరవ పరిచేలా మాట్లాడినా కలిసే ఉంటాం. గవర్నర్ గారికి గౌరవం ఇవ్వని పార్టీ ఈ సభలోకి రాకూడదు" అని పవన్ అన్నారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదు.. ప్రజలు

-మొదటిపేజీ తరువాయి

16,384 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. ఎంత మంది పిల్లలున్నా అందరికీ అమలు చేస్తాం. కేంద్ర పథకాలకు ఇచ్చిన గ్రాంట్‌ను కూడా గత ప్రభుత్వం వాడేసింది. జల్‌జీవన్ కోసం రూ.80వేల కోట్లు కావాల్సి ఉంటే.. గత ప్రభుత్వం కేవలం రూ.20వేల కోట్లు అడిగింది. అందరూ గర్వపడేలా రాజధాని నిర్మిస్తాం"

"గత ప్రభుత్వంలో రంగుల పిచ్చి ఎక్కువయ్యింది.. సర్వే రాళ్లపైనా బొమ్మలు వేసుకున్నారు. పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే మా లక్ష్యం. ఇళ్లు లేని పేదలకు ఐదేళ్లలో ఇళ్లు నిర్మిస్తాం. గ్రామీణ పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తాం. ఉగాది రోజున పీ-4 విధానాన్ని ఆవిష్కరిస్తాం. 20లక్షల ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత. రూ.6.50లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ పూర్తి చేశాం. తాజా పెట్టుబడుల ద్వారా 5లక్షల ఉద్యోగాలు వస్తాయి. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి ఇస్తాం"అని సీఎం ప్రకటించారు.

అసెంబ్లీ వేదికగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తల్లికి వందనం సహా.. అనేక పథకాల అమలును ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. తల్లికి వందనం పథకం అమలు వ్యవహారంపై మాట్లాడిన సీఎం.. ఈ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. పథకాన్ని అమలు చేస్తామన్నారు. మే నెలలో ఈ పథకం డబ్బులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

రైతుకు భరోసా కల్పించే విషయంలో తాము చెప్పినట్లుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు సీఎం. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 14 వేలు కలిపి మొత్తం రూ. 20వేలు ఇస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ అమలు చేస్తామని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి మరోసారి ఉద్ఘాటించారు. ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను



పెంచామన్నారు. సాధారణ పింఛన్‌ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచామన్నారు. రూ. 33 వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పింఛన్లు ఇచ్చే దేశంలోనే ఏకైక కార్యక్రమం ఇది అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ సమయానికి జీతాలు ఇస్తున్నామని, ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నామని సీఎం చెప్పారు.

వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అన్న క్యాంటిన్లు మూసేశారని.. ఇప్పుడు తాము తిరిగి ప్రారంభించామన్నారు. పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని.. ఆ హామీని అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా 93 లక్షల మందికి దీపం 2 అందుతోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి డీఎస్సీ సెలక్షన్ పూర్తి చేసి బడులు తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక మత్స్యకారులకు సైతం అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు రూ. 20 వేలు ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం వారికి హాలిడే ఇస్తామని.. ఆ హాలిడే కంటే ముందుగానే ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామన్నారు.

డీఎస్సీపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ నిర్మాణమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం అన్ని విధాలా సాయం చేస్తోందన్నారు. కేందమే సాయం చేసి ఉండకపోతే.. మనకు మరిన్ని ఇబ్బందులు వచ్చి ఉండేవన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నామని చెప్పారు. గతంలో కౌరవ సభ.. ఇప్పుడు గౌరవ సభ అంటూ సీఎం చంద్రబాబు అభివర్ణించారు. అసెంబ్లీ అంటే దేవాలయంతో సమానమని తెలిపారు. అసెంబ్లీలో సోమవారం జరిగిన పరిణామాలు ఒక చీకటి రోజు అని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననే వ్యక్తిని.. తన రాజకీయ జీవితంలో చూడటం ఇదే తొలిసారిని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు.

ప్రతిపక్ష హోదా డిమాండ్ ఏ విధంగా సబబు అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రతిపక్ష హోదా మేం ఇచ్చేది కాదు.. ప్రజలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మా స్వార్థ ప్రయోజనాల కోసం తాము కలవ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే కూటమిగా ఏర్పాడ్డామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు సైతం మూసివేశారని గుర్తు చేశారు. కానీ తాము 204 అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించామన్నారు. హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా వివరించారు. అలాగే హామీల అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. పెన్షన్లను రూ.4 వేలకు పెంచామని.. అదే దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత వైసీపీ పాలనలో గ్రోత్ రేట్ ఎలా తగ్గిందో స్లైడ్స్‌తో సోదాహరణగా సీఎం చంద్రబాబు వివరించారు. 2024-25లో 12.94 శాతం గ్రోత్ వచ్చిందన్నారు. వైసీపీకి ఎన్డీఏకు ఓ ఏడాది సంపదలో తేడా రూ. 62 వేల కోట్లని ఆయన పేర్కొన్నారు. రూ. 9,54,576 కోట్లు అప్పులు పెట్టారని తెలిపారు. గ్రోత్ రేట్‌ను డబుల్ చేయగలిగితే.. నాలుగున్నర రెట్ల ఆదాయం పెరుగుతోందని చెప్పారు. దేశంలో అత్యధికంగా తలసరి ఆదాయం ఎక్కడా అంటే తెలంగాణలో అని తేలిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# వాస్తవాలకు విరుద్ధంగా గవర్నర్ ప్రసంగం

-మొదటిపేజీ తరువాయి

నారా లోకేష్ మళ్లీ అభ్యంతరం తెలిపారు.

మేం కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇచ్చాం.. మా మీద కేంద్ర ప్రభుత్వం ఆధారపడిందని ఏనాడూ అనలేదంటూ మంత్రి లోకేష్ చెప్పుకొచ్చారు. మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కేంద్రంలో ఉన్నది వీళ్ల ఉమ్మడి ప్రభుత్వం కాదా..?. మా మీద ఆధారపడలేదని చెప్తారా..?. రాష్ట్ర ప్రయోజనాల కోసమన్నారు. అదే మా సభ్యురాలు చెప్తున్నది. 2014 నుండి 2019 మధ్యలో ప్యాకేజీ కోసం హోదాను వదిలేయలేదా..?" అంటూ విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు.



గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. "చంద్రబాబు పాలన గొప్పలు చెప్పుకుంటున్నారు.. కానీ ఓటేసిన జనం చెప్పులతో కొట్టుకుంటున్నారు. తొమ్మిది నెలల్లో రైతులు, మహిళలు, పేదల జీవితాలు తలకిందులైపోయాయి. సూపర్ 6 పథకాలకు ఎగనామం పెట్టడం సుపరిపాలనా..?. ఉద్యోగులకు డీఏ, ఐ ఆర్, పీ ఆర్ సీ ఇవ్వకపోవడమే సుపరిపాలనా..?. అమ్మ ఒడి, రైతు భరోసా ఎగ్గొట్టడం సుపరిపాలన అవుతుందా.?" అంటూ వరుదు కళ్యాణి నిలదీశారు.

"రూ.15 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపారు. 60 శాతం నిత్యవసర వస్తువులు ధరలు పెంచారు. 4 లక్షలు ఉద్యోగాలు ఇచ్చేశాం అని చెప్పారు..ఎక్కడ ఇచ్చారు..? చూపించండి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ జగన్ 6 నెలల్లో లక్షా 25 వేల ఉద్యోగాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం.. తొలి సంతకం పెట్టిన మెగా డీఎస్సీని కూడా పూర్తి చేయలేదు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని కూడా ఇవ్వకుండా మోసం చేశారు. టీడీపీ పై ఆధారపడ్డ కేంద్ర ప్రభుత్వం ఉన్నా ప్రత్యేక హోదాను సాధించలేదు" అని వరుదు కళ్యాణి దుయ్యబట్టారు.

**గవర్నర్ ప్రసంగంలో దశ లేదు, దిశలేదు .. మీడియాతో బొత్స**

గవర్నర్ ప్రసంగంలో దశ లేదు.. దిశలేదు.. ఓ క్లారిటీ లేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్‌లో బొత్స మీడియాతో మాట్లాడారు. గవర్నర్ చాలా శ్రమించి ప్రసంగం కొనసాగించారు. ఆయన ప్రసంగంలో దశలేదు.. దిశలేదు. ఓ క్లారిటీ లేదు. సుప్రీంకోర్టు జడ్జీగా పనిచేసిన వ్యక్తితో అబద్దాలు, అసత్యాలు చెప్పించారు.

19 మంది వీసీలతో బలవంతంగా రాజీనామాలు చేయించారు. వీసీలు తమ రాజీనామాల లేఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ నుండి ఫోన్స్ వచ్చాయని, అందుకే రాజీనామా చేశామని పేర్కొన్నారు. వీసీలు రాజీనామాలపై కమిటీ వేయాలని డిమాండ్ చేశాం.. వేస్తామన్నారు. తర్వాత మాట మార్చారు. 19 మంది వీసీల రాజీనామా లేఖల్ని బయట పెట్టాలి. ఒకేసారి అంతమంది వీసీలు ఎందుకు రాజీనామా చేశారో చెప్పాలి. ప్రభుత్వాలు వస్తుంటాయి.. మారుతుంటాయి. అది వ్యవస్థ.. దాన్ని మార్చితే ఎలా? ప్రజా వ్యతిరేక, ప్రజలకు మేలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. సందర్భం, సమయం కానీ అంశాలు సభలో మాట్లాడం సమంజసం కాదు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారు. మంత్రి లోకేష్ ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదు. గ్రూప్ 2 మెయిన్స్‌పై లోకేష్ ట్వీట్ చేశారు.. మేం మా అభిప్రాయం చెప్పాం. వాకౌట్ చేయడానికి రెండు కారణాలు.ప్రసంగంలో దశ ,దిశ లేదు. గవర్నర్‌తో విధ్వంసం అనే మాట మాట్లాడించొచ్చా? మాట్లాడిన దాంట్లో కూడా అద్భుతాలు ఉన్నాయా అంటే అది లేదు.2047కి సూపర్ టెండర్ అంట..అంటే సూపర్ సిక్స్ పోయిందా?' అని ప్రశ్నించారు

అందుకోసమే అసెంబ్లీకి రాలేదు.. బొత్స సత్యనారాయణ షాకింగ్ కామెంట్స్

అమరావతి: అసెంబ్లీ సమావేశాల్లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం సత్యదూరంగా ఉందని మాజీ మంత్రి, వైసీపీ అగ్రనేత బొత్స సత్యనారాయణ అన్నారు. గవర్నర్ ప్రసంగంలో క్లారిటీ లేదన్నారు. . గత ప్రభుత్వం చేసిన విధ్వంసం అంటూ గవర్నర్ ప్రసంగించడం కరెక్ట్ కాదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21 యూనివర్సీటీ వీసీలలో 19 మందిని రాజీనామా చేయించారని అన్నారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా వీసీలను రాజీనామా చేయించిందని మండిపడ్డారు. వీసీల రాజీనామాపై విచారణ జరిపించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. సందర్భం కాని అంశాలను మంత్రి నారా లోకేష్ సభలో మాట్లాడుతున్నారని చెప్పారు. వైసీపీ నేతలను బెదిరించే విధంగా లోకేష్ మాట్లాడుతున్నారని బొత్స సత్యనారాయణ ఫైర్ అయ్యారు. ఆ బెదిరింపులకు భయపడేది లేదు.. అవసరమైతే విచారణ చేసుకోవాలని బొత్స సత్యనారాయణ సవాల్ విసిరారు. గ్రూప్ 2 పరీక్షల్లో కూటమి ప్రభుత్వం అభ్యర్థులను మభ్యపెట్టిందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాజకీయ అవగాహన లేదని.. ఆవేశంతో మాట్లాడి ఉంటారని బొత్స సత్యనారాయణ అన్నారు. పవన్ కల్యాణ్ అపోజిషన్‌లో ఉంటానంటే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. తాము పదవులను కాపాడు కోవటానికి అసెంబ్లీకీ హాజరు కాలేదని స్పష్టం చేశారు. ఎటువంటి పరిస్థితులు ఎదుర్కోటానికి అయినా తాము సిద్ధంగా ఉన్నామని బొత్స సత్యనారాయణ తెలిపారు.

## ఆకర్షణీయమైన పెట్టుబడులకు గమ్యస్థానం ఏపీ

-మొదటిపేజీ తరువాయి

సంస్కరించడంలో, సరళీకరించడం లో రాష్ట్రాలకు సహాయం చేయడానికి కేబినెట్ సెక్రటేరియట్లో కార్యదర్శి స్థాయి కోఆర్డినేటింగ్ అధికారి నేతృత్వంలో డీరెగ్యులేషన్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేగాక కంప్లైయన్స్ తగ్గింపు మరియు డీరెగ్యులేషన్‌పై టాస్క్‌ఫోర్స్‌గా వ్యవహరిం చడానికి క్యాబినెట్ సెక్రటరీ అధ్యక్షతన కార్యదర్శుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈప్రక్రియలో భాగంగా కేబినెట్ కార్యదర్శి సోమనాధన్ సిఎస్ లతో వీడియో సమావేశం ద్వారా మాట్లాడుతూ కంప్లయెన్స్ భారాన్ని తగ్గించేందుకు డీరెగ్యులేషన్ సెల్ కు తగిన తోడ్పాటును అందించేందుకు పలువురు కార్యదర్శులతో కూడిన ప్రత్యేక టాస్కుఫోర్సు కమిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈకమిటీలో సభ్యులైన కార్యదర్శులు మార్చి నుండి రాష్ట్రాల్లో పర్యటిస్తారని వారు పర్యటనకు వచ్చినపుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక ఇంటర్డెక్టరీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిఎస్ లకు సూచించారు. సులభతర వాణిజ్యానికి సంబంధించి వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను కేంద్రం స్వాగతిస్తుందని కేబినెట్ కార్యదర్శి సోమనాధన్ తెలిపారు. ఈవీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ సులభతర వాణిజ్య విధానంలో భాగంగా కంప్లైయన్స్ బర్డెన్ తగ్గించడం లేదా రెగ్యులేటరీ కంప్లైయన్స్ బర్డెన్‌ను తగ్గించడం కార్యక్రమం అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రం ఇప్పటివరకు 60 కి పైగా నిబంధనలలో 632 సమ్మతిని తగ్గించిందని వివరించారు.ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కంప్లెయెన్స్ బర్డెన్ తగ్గించే కార్యక్రమం కింద తిరిగి ఊపందుకోవడానికి కృషి జరుగుతోందని చెప్పారు.రాష్ట్రంలో ఈకార్యక్రమం అమలును పర్యవేక్షించడానికి సిఎస్ నేతృత్వంలో ఒక సాధికార కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.వివిధ విభాగాలు సమర్పించిన సమ్మతి తగ్గింపు ప్రతిపాదనలను కూడా ఈసాధికార కమిటీ సమీక్షించడంతో పాటు అందుకు తగినట్లుగా తగిన ఆదేశాలను జారీ చేస్తుంది చెప్పారు.

దేశంలో అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులకు గమ్యస్థానంగా మారాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (వ్యాపార సంస్కరణ కార్యాచరణ ప్రణాళిక. కార్యక్రమానికి ప్రాధాన్యతను ఇస్తోందని సిఎసి విజయానంద్ కేబినెట్ కార్యదర్శికి వివరించారు.2025 ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 7 విభాగాలలో 60 కి పైగా భారమైన సమ్మతిని తగ్గించడం జరిగిందన్నారు.అంతేకాకుండా వ్యాపార వాతావరణాన్ని మరింత క్రమబద్ధీకరించడానికి మరింత భారమైన నిబంధనలను గుర్తించడానికి మరియు తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సిఎస్ చెప్పారు.మార్చి 1వ వారంలోగా మిగిలిన సమ్మతులను హాజరయ్యేలా చూసుకోవాలని సిఎస్ ఆయా విభాగాలను ఆదేశించారు.రాష్ట్రంలో వ్యాపారాన్ని సులభతరం చేసే స్థితిని సమీక్షించడానికి మరియు మన రాష్ట్రం నుండి ఉత్తమ పద్ధతులను ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లడానికి భారత ప్రభుత్వం నుండి ఒక బృందం మార్చి 1వ వారంలో రాష్ట్రాన్ని సందర్శించ నుందని తెలిపారు.అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతుల ఆధారంగా ఈబృందం కొన్ని సూచనలను కూడా ఇస్తుందని భావిస్తున్నట్టు సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు.

ఈవీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అనంతరాము,బి.రాజశేఖర్, వాణి ప్రసాద్,ముఖ్య కార్యదర్శులు ముకేశ్ కుమార్ మీనా,శశి భూషణ్ కుమార్,ఎస్ సురేశ్ కుమార్,కార్యదర్శులు డా.ఎన్.యువరాజ్, ఎంఎం నాయక్,సౌరవ్ గౌర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వల్లభనేని వంశీకి 20 ప్రశ్నలు..

-మొదటిపేజీ తరువాయి

వంశీని ముగ్గురు ఏసీపీలు విచారించారు. మరో వైపు వంశీ రిమాండ్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ గడువు నేటితో ముగియనుండటంతో జైలు నుంచే వంశీని వర్చువల్‌గా జడ్జి ఎదుట పోలీసులు హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి మార్చి 11 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

## చకచకా అమరావతి పనులు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మార్చి 15వ తేదీ నుంచి అమరావతి పనులు ప్రారంభం కానున్నాయి. అమరావతిలో వివిధ రకాల పనులు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా పనుల్లో జాప్యమైంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో టెండర్ల ఖరారులో ఆలస్యం జరిగింది. తాజాగా టెండర్లు పిలిచేందుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా టెండర్లను ఖరారు చేయొద్దని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు 62 పనులకు అధికారులు టెండర్లు పిలిచారు. రూ.42 వేల కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలోనే మరో 11 పనులకు కూడా టెండర్లు పిలవనున్నట్లు సమాచారం. టెండర్లు పిలిచేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వటంతో త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. మార్చి 15 నుంచి అమరావతిలో పనులు ప్రారంభం కానుండగా.. ఏప్రిల్ నుంచి జోరందుకోనున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి 30 వేల మంది కార్మికులతో అమరావతిలో పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని అధికారులు చెప్తున్నారు.మరోవైపు తెలుగుదేశం పార్టీ 2014-19 మధ్యన అధికారంలో ఉన్న సమయంలో రాజధాని అమరావతిలో ఎన్ఆర్‌టీ ఐకానిక్ భవనం నిర్మాణం తలపెట్టిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే దీనికి శంకుస్థాపన జరిగింది. అయితే 2019 ఎన్నికల్లో గెలిచి వైసీపీ అధికారంలోకి రావటంతో ఎన్ఆర్‌టీ ఐకానిక్ భవనం నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం కూటమి సర్కారు అధికారంలోకి రావటంతో ఎన్ఆర్‌టీ ఐకాన్ భవనం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం నిర్మాణ కమిటీని నియమించింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సీఈవో మెంబర్ కన్వీనర్‌గా, టర్నర్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నుంచి ఒక సాంకేతిక సభ్యుడు, ఐదుగురు సభ్యులు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

## మరో ఇన్నర్ రింగ్ రోడ్డు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్‌లో మరో రింగ్ రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పెద్దఎత్తున రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. రూ.506 కోట్ల అంచనా వ్యయంతో కుప్పానికి రింగు రోడ్డు, అంతర్రాష్ట్ర రహదారుల అభివృద్ధికి, వంతెనలకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ రింగ్ రోడ్డు, మిగిలిన పనులకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. కుప్పం పట్టణానికి ఇన్నర్ రింగు రోడ్డును పూర్తి చేసేందుకు రూ.54 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. ప్రస్తుతం ఉన్న రోడ్లని మరో 5 కిలోమీటర్లు నిర్మించి రోడ్డును పూర్తి చేస్తారు.కుప్పం నియోజకవర్గంలో 11 బ్రిడ్జ్‌లను నిర్మించేందుకు 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.38.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే నియోజకవర్గంలో 89 కిలోమీటర్ల రోడ్లను రూ.41.15 కోట్ల నాబార్డు నిధులతో అభివృద్ధి చేయనున్నారు. 67 కిలోమీటర్లున్న 8 రోడ్లను సీఆర్ఎఫ్ నిధులు రూ.134 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు అధికారులు. కుప్పం ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంగా ఉంది.. అందుకే అంతర్రాష్ట్ర రహదారుల కనెక్టివిటీ పెంచేందుకు రూ.178.51 కోట్లతో ప్రతిపాదనలు పంపించామంటన్నారు అధికారులు. 43 కిలోమీటర్ల రోడ్లను కూడా 5 పనులుగా మంజూరుకు ప్రతిపాదించారు అధికారులు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రెండుసార్లు కుప్పంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయనే స్వయంగా ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. 27 కిలోమీటర్లున్న 5 రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు అర్జీల్లో కోరారు. సానుకూలంగా చంద్రబాబు సానుకూలంగా స్పందించగా.. ఆ రోడ్లకు రూ.58 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు దాన్ని కూడా తాజా ప్రతిపాదనల్లో పెట్టారు అధికారులు. అంతేకాదు కుప్పంలో అభివృద్ధి పనుల కోసం నిధుల్ని కూడా కేటాయిస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలో పనులపై స్పెషల్‌గా ఫోకస్ పెట్టారు.. ఇటీవల నిధులు కేడా కేటాయించారు. తాజాగా రోడ్ల అంశంపై ఫోకస్ పెట్టారు. . మిగిలిన పనుల్ని చేపట్టారు.

# సంపాదకీయం

## 'ఉచితా'ల మీద ఆగని రగడ

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ కోర్టులో విచారణ సందర్భంగా ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలపై వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు పోటీపడి ఉచితాలు వాగ్దానం చేస్తున్నాయని, అది మంచి పద్ధతి కాదని, ఉచితాలను పంచి పెట్టటం వలన ప్రజలు పని చేయటం మానేస్తున్నారని, వుచితాలు పంచటం ద్వారా మనం పరాన్న భుక్కు వర్గాన్ని తయారు చేస్తున్నామా? అని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశ పెట్టటంతో ప్రజలు వుచితాల పైనే ఆధారపడుతున్నారని, పని చేయటానికి యిష్టపడటం లేదని, పని చేయకుండా వుచిత రేషన్ పొందుతున్నారని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి వచ్చిన సీనియర్ లాయర్ – ప్రశాంతి భూషన్– కలుగజేసుకొని చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది, సరైన పని దొరక్కపోవటం వల్లనే, కదా! అని అన్నారనుకోండి. ఒక్క జస్టిస్ గవాయ్ మాత్రమే కాదు. దేశంలోని సంపన్న వర్గాలన్నీ కలిసి పేదల మీద కత్తి కట్టాయి. ఉచితాల రద్దు కొరకు, పని గంటల పెంపు కొరకు పెద్ద యెత్తున ప్రచారం చేస్తున్నాయి. కార్పొరేట్ మీడియా వారికి వూడిగం చేస్తూ వుంది. మనదేశాన్ని ప్రపంచంలో నంబరు వన్‌గా తయారు చేయటానికే యిదంతా, అని అంటున్నారు. అంతిమ పరిశీలనలో యిదంతా వారి స్వార్థం కొరకేనని, దేశ ప్రయోజనం యిందులో యిసుమంతయినా లేదని తేలుతుంది. జస్టిస్ గవాయ్, తాను వ్యవసాయ కుటుంబాన్నుండి వచ్చినంత మాత్రాన తనకు వ్యవసాయం గురించి అంతా అర్థమౌతుందా? ఏది అర్థం కావాలన్నా, ముందు దాన్ని గురించి అధ్యయనం చేయాలి. వారు అధ్యయనం చేశారా? వారు చేశారో, చెయ్యలేదో నాకు తెలియదు. నేను కూడా వ్యవసాయ కుటుంబాన్నుండే వచ్చాను. ఉద్యోగానికి ముందు వ్యవసాయ పనులన్నీ చేశాను. వాటిలో వున్న కష్ట,నష్టాలన్నీ నాకు తెలుసు. అంతేకాదు, ఆరు సంవత్సరాల వ్యవధిలో రెండు దఫాలుగా గ్రామీణ ఆర్థిక, సామాజిక సర్వే నామిత్రులతో కలిసి చేశాను. ఆ సర్వే ఆధారంగా మీ ఉచితాల బండారం బయటపెడతాను. గ్రామాల్లో ఒక వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరంలో ఎన్ని దినాలు పని దొరుకుతుంది, స్త్రీలకు, పురుషులకు విడివిడిగా వివిధ సీజన్లలో యిచ్చే కూలిరేట్లు, కుటుంబంలో పని చేసే వారి సంఖ్య లాంటి వివరాలు సర్వేలో సేకరించాలి. ఈ వివరాలు వుపయోగించి వారి కుటుంబ సాంవత్సరిక ఆదాయాన్ని లెక్కించాలి. అట్లాగే ఆ కుటుంబానికి సంవత్సరం మొత్తంలో అయ్యే ఖర్చు లెక్కించాలి. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువని తేలితే ఆ కుటుంబం లోటులో వుందని అనుకోవాలి. అది పస్తుల పాలవుతున్న కుటుంబం అని అర్థం చేసుకోవాలి. లేదా, అప్పుల పాలవుతున్న కుటుంబం అని అనుకోవాలి. ఆ లోటుకు కారణం మాత్రం యీ కుటుంబంకాదు. ఆ లోటుకు కారణం వారిమీద జరిగే శ్రమదోపిడీ. లేదా కూలి వానికి తగినంత పని దొరికి వుండకపోవచ్చు. లేదా, రెండూ జరిగి వుండవచ్చు. యీ కారణాలలో దేనివలన అయినా యీ లోటు యేర్పడి వుండవచ్చు. ఆ లోటుకు కారణమైన వాళ్లే (దోపిడీదారులు) ఆ లోటును భర్తీ చేయాలి. అలాంటప్పుడు అది ఉచితమెలా అవుతుంది? అది దోచుకున్న సొమ్మును పూర్తిగా గాని, పాక్షికంగా గాని తిరిగి యివ్వటమే కదా! ప్రభుత్వం పేదలకిచ్చే రాయితీలు, తాయిలాలు, అన్నీ యీ శ్రమ దోపిడీ కారణంగా ప్రభుత్వం దగ్గర పోగుపడే సామాజిక మిగులు నుండే వస్తాయి. కాబట్టి అవన్నీయేవీ "ఉచితా"లు కాదు. అవి, కూలీల కష్టార్జితం మాత్రమే. అవి "వుచితా"లని మీరు భ్రమపడుతున్నారు.ఆరు సంవత్సరాల వ్యవధిలో మేము జరిపిన రెండు సర్వేల్లో, మొదటిది 2008లో జరిగింది. వుమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 గ్రామాలు సర్వే చేశాము. డేటా ఎనలైజ్ చేస్తే వచ్చిన ఫలితాలలో మన విషయానికి సంబంధించినవి యీ విధంగా వున్నాయి. 1 గ్రామాల్లో భూమిలేని కుటుంబాలు దక్షిణ కోస్తా జిల్లాల్లో (ప్రకాశం జిల్లా మినహా) 70 నుండి 80 శాతం వరకు వున్నాయి. మిగిలిన జిల్లాల్లో అవి 40 నుండి 50 శాతం వరకు వున్నాయి. అంటే దక్షిణ కోస్తాలో అత్యధిక కుటుంబాలకు సెంటుభూమి కూడా లేదు. భూమిలేని వాళ్లు కూలిపని చేసుకోవలసిందే కదా! వ్యవసాయ కార్మికులు, పేదరైతుల సమాచారంతో పాటు యితర వర్గాల సమాచారం కూడా సేకరించాము. 2 గ్రామాల్లో సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి 59.46శాతం, అంటే సుమారుగా 60శాతం కుటుంబాల వారున్నారు. వారి సగటు తలసరి, దినసరి ఆదాయాలు వరుసగా రు.18.89లు, రు.16.80లు, రు.18.28లుగా లెక్క తేలింది. ఆనాటి ప్రొ.ఎఅర్జున్ సేన్ గుప్తా కమిటి అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖ హద్దు రు.20/–లుగా లెక్క తేలింది. పై మూడు తరగతుల వారి తలసరి, దినసరి ఆదాయాలు రు.20ల కంటే తక్కువే కాబట్టి వారంతా దరిద్రంలో వున్నట్లే లెక్క. గ్రామాలలో వారి కుటుంబాలు మొత్తం 60శాతం వున్నాయి. అంటే గ్రామాల్లో సగానికి పైగా కుటుంబాలు కనీసస్థాయి జీవనం కూడా గడప లేకుండా వున్నాయని అర్థం. వారు పస్థులుంటున్నారు. వారికి న్యూట్రిషస్ ఆహారం అందటం లేదు. అంటే, కనిష్టస్థాయి జీవనం గడిపే దానికి అవసరమైనంత ఆదాయం కూడా వారికి రావటం లేదు. వారి ఆదాయంలో లోటు వుంది. ఉచితాలందుకుంటున్న జనం వీరే. ఆ "ఉచితా"లు కూడా వీరి ఆదాయాల్లో యేర్పడే లోటును పూడ్చ లేకుండా వున్నాయి. ఆ రెండవ సర్వేకూడా 20 జిల్లాల్లో, 80 గ్రామాల్లో 2014లో జరిగింది. అంటే మొదటి సర్వే తరువాత 6 సంవత్సరాలకు జరిగింది. ఆ డేటాను విశ్లేషిస్తే యీ కాలంలో కూలీలు, పేదరైతుల పరిస్థితి మరింత దిగజారిందని తేలింది. 1) యీ ఆరు సంవత్సరాలలో భూకేంద్రీకరణ పెరిగింది. గతంలో 70 నుండి 80 శాతం కుటుంబాలకు భూముల్లేవని చూశాము. అది యిప్పుడు 75 శాతం నుండి 85 శాతానికి పెరిగింది. 2) యీ కాలంలో యాంత్రీకరణ గతం కంటే బాగా పెరిగింది అంటే, కూలీలకు పనిదినాలు తగ్గాయని అర్థం. 3) కౌలు రైతులు, సన్నకారు రైతులు కూలికి పోవటం యెక్కువ యింది. మొదటి సర్వే నాటికి సన్నకారు రైతుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 37శాతం మాత్రమే. అది యిప్పుడు 63.8శాతానికి పెరిగింది. కౌలురైతులకు అది 37శాతం నుండి 58.2 శాతానికి పెరిగింది. అంటే రైతులు కూలి పనులకు పోవటం యెక్కువయిందనేగా దానర్థం. వీళ్లు కూడా కూలి పనులకు ఎగబడితే కూలీల మధ్య పోటీ పెరిగి కూలిరేట్లు తగ్గుతాయి. (రైతులు కూడా కూలి పనులకు పోవటం వాళ్లకదేమీ సరదా కాదు. యిల్లు గడవకనే వాళ్లు కూడా కూలి పనులకు పోతున్నారు.) పనిదినాలు తగ్గితే, వారి ఆదాయాల్లోని కూలి భాగం తగ్గాలి కదా! తగ్గింది. మొదటి సర్వేలో వ్యవసాయ కార్మికుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 88.6శాతం వుంటే, అది రెండవ సర్వేలో 53శాతానికి పడిపోయింది. యీ తగ్గిన భాగాన్ని కొంత వరకైనా పూడ్చుకోటానికి వాళ్లెన్ని తిప్పలు పడ్డారో డేటా చూస్తే గాని మనకు అర్థం కాదు. యింతచేసినా వారి కడుపు నిండుతుందా? అనుమానమే. యిలాంటి వాళ్లను వుద్దేశించి "ఉచితా"లు యిస్తే పని చేయరు. మనం పరాన్నభుక్కులను తయారు చేస్తున్నాము అని సుద్దులు చెప్పటం యెంత అమానుషం? మరొక మాట కూడా జడ్జిగారు అంటారు. ఏమని? లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశ పెట్టటంతో ప్రజలు "వుచితా"ల పైనే ఆధారపడుతున్నారని, పని చేయటానికి యిష్టపడటం లేదని, వ్యవసాయదారులకు కూలీలు దొరటం లేదని అన్నారు. కూలీలు దొరకకపోవటానికి, యీ "ఉచితా"లకు యెలాంటి సంబంధం లేదు జడ్జిగారూ! గ్రామాల్లో పూర్వం 5,6 పంటలు పండించేవారు. వేరు, వేరు కాలాల్లో వేరు, వేరు పంటలు పనులు కల్పిస్తూ వుండేవి. దానివలన కూలీలకు సంవత్సరం పొడవునా (ఒక్క మండు వేసవి తప్ప) పనులు దొరికేవి. ఆయా గ్రామాల్లో తయారయ్యే పనిదినాలన్నీ ఆ గ్రామాలలో వున్న కూలీలకే దక్కేవి. కాబట్టి కూలీలకు పనిదినాలు యెక్కువగా దొరికేవి. యిప్పటికంటే వారి పరిస్థితి కొంతవరకు మెరుగ్గా వుండేది. కాని యిప్పుడు పంటల పద్ధతి మారిపోయింది. ఎక్కువగా మోనోక్రాపింగ్ పద్ధతి వచ్చింది. వూరంతా ఒకే పంట, లేదా రెండు పంటలు. ఒక్క వూరే కాదు. రాష్ట్రమంతా యింతే. కాబట్టి పనులు సీజనల్‌గా తయారయ్యాయి. ప్రధానంగా నాట్లు, కోతలు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. మిగిలిన కాలమంతా కూలీలకు పనులుండవు. కూలీలు దొరకకపోవటానికి పంటల పద్ధతిలో వచ్చిన మార్పు ఒక ప్రధాన కారణం. కాబట్టే ప్రాంతాల మధ్య పెద్ద యెత్తున వలసలు పెరిగాయి. మనదేశంలో సంపదలకు అర్థమే లేకుండా పోయింది. ఒక్క అదానీకి వున్న ఆస్తులు – మన దేశంలో వున్న దాదాపు అన్ని నౌకాశ్రయాలు, అన్ని విమానాశ్రయాలు, లెక్కలేనన్ని విద్యుత్ కేంద్రాలు, ఖనిజ సంపదలతో నిండిన అడవులు, ప్రభుత్వం కారు చౌకగా కట్టబెట్టే పబ్లిక్ రంగ సంస్థలు – యిట్లా చెప్పుకుంటూ పోతే అది కొండవీటి చాంతాడంత అవుతుంది. ఆకలి సూచీలో మనం 105వ స్థానంలో వున్నాము. అధికారం చేతిలో వుంటే సంపద ప్రవాహాన్ని మన యిష్టమొచ్చిన దారిలోకి మళ్లించవచ్చు.

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం

# ధర్మపురి శివాలయం

భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణాసక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రంలో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామలింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీభూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబ డకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాళుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉండి. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా



నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణంలో మూడు ద్వారాలకు ఆభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలోవలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృహణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎ త్తుగా, నిటారుగా 15అడుగుల ఎత్తు ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చొని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్రగొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళు ్ళ) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లుల శిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శతృవులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది. పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఒకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వా లలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్టించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్థం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠచేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్ధం కాలంనాటి చండిక విగ్రహం కలదు. ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహరీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహరీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీనేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి. క్రీ.శ.1332–1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయా మాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674–1687) మంత్రియగు మాదోభా నూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిధాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూ తతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది. శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంత ర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు.

# పాశ్చాత్య వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీ గోపాల్ జోషి

పాశ్చాత్య వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీ గోపాల్ జోషి లేదా ఆనందీబాయి జోషి. (కాదంబిని గంగూలీ కూడా అదే సంవత్సరం అనగా 1886 లో ఆనందీబాయి తర్వాత పట్టాపొందారు.) ఈ గుర్తింపు పొందిన మొదటి హిందూ మహిళ కూడా ఈమే. అమెరికాలో అడుగుపెట్టిన తొలి హిందూ మహిళ కూడా ఈమేనని భావించబడుతున్నది. ఈమె జన్మదినాన్ని పురస్కరించుకొని 2018 లో గూగుల్ తన డూడుల్ ని పెట్టింది .ఆనందీబాయి పూణే (మహారాష్ట్ర) లోని సనాతన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈమెకు తల్లితండ్రులు యమున అని పేరు పెట్టారు. 9 సంవత్సరాల వయసులో దాదాపు ఇరవై సంవత్సరాలు పెద్దయిన గోపాల్ రావు జోషిని వివాహం చేసుకుంది. వివాహం తరువాత, ఆమె భర్త ఆమెకు ఆనందీబాయి అని పేరు పెట్టాడు." సెరంపోర్ కాలేజ్" హాలులో ఆనందీబాయి ఉపన్యసించిన సమయంలో తాను వైద్యవిద్యను అభ్యసించడానికి అమెరికా ఎందుకు వెళ్ళాలనుకుంటుందో వెల్లడించింది. అనందీబాయి ఆమెభర్త అనుభవించిన హింస గురించి తన ఉపన్యాసంలో వివరించింది. భారతదేశంలో హిందూ మహిళావైద్యురాళ్ల అవసరం గురించి వివరించింది. అలాగే ఆమె భారతదేశంలో మహిళా వైద్య కళాశాల ప్రారంభించడం తన లక్ష్యమని వివరించింది. అయితే తాను క్రైస్తవమతాన్ని స్వీకరించనని మాత్రం వత్తిపలికింది. ఆమె ఉపన్యాసం



దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. భారతదేశం నలుమూలల నుండి ఆర్థికసహాయం చేస్తామని సందేశాలు అందుకున్నది. ఆమె విద్యకు సహాయంగా అప్పటి భారత వైస్రాయి కూడా 200 రుపాయల ఆర్థికసాయం పంపాడు. భర్తకు అమెరికాలో ఉద్యోగం లభించని కారణంగా అనందీబాయి మాత్రం ఒంటరిగా ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్ళింది. విపరీతమైన వ్యతిరేకతల నడుమ ఆమె 1883 జూన్ మాసంలో వైద్యవిద్యాభ్యాసానికి అమెరికాలో కాలు పెట్టిందిఆమె తీవ్ర ఆరోగ్యసమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నతవిద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ ఎగ్జాంస్ వ్రాసింది. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది.భారతదేశానికి తిరుగుప్రయాణం చేసే సమయంలో ఆనందీబాయి ఆరోగ్యం మరింత దిగజారింది. నౌకాలో ప్రయాణం చేసే సమయంలో ఆమెకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించారు. వైద్యులు చికిత్సచేడానికి నిరాకరించడానికి కారణం ఆమె " బ్రౌన్ వుమన్ " (సాధారణంగా భారతీయులను బ్రౌన్ ప్రజలు అంటారు ) కావడమే. 1886 చివరిభాగంలో, ఆనందిబాయి భారతదేశానికి తిరిగివచ్చారు. దేశం ఆమెకు ఘనంగా స్వాగతం పలికింది. ఆమెను కొల్హాపూర్ సంస్థానానికి చెందిన వైద్యురాలిగా నియమించింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్యశాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించిందికలకత్తా చేరిన తరువాత ఆనందీభాయి బలహీనత, నిరంతర తలనొప్పి, తరచూ జ్వరం, ఆయాసాలతో బాధపడింది. థియోడిసియా ఆమెకు అమెరికా నుండి ఔషధాలను పంపింది. తరువాత ఆమె ఆయుర్వేద చికిత్స కొరకు కజిన్ ఇంట్లో బసచేసింది. ఆయుర్వేద వైద్యనిపుణుడు ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్సచేయడానికి నిరాకరించాడు. భారతదేశానికి తిరిగివచ్చిన ఒక్క సంవత్సరంలోపుగానే ఆమె ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరు.ప్రాయంలో అకాలమరణం చెందారు.

# సామన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు..

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.**

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** పుణ్యగిరి కొండపైన శివరాత్రి భద్రత ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ట్రాఫిక్ రెగ్యులేషను, డైవర్షన్ పాయింట్లు, వాహనాల పార్కింగు ప్రాంతాలను సందర్శించిన జిల్లా ఎస్పీ
పుణ్యగిరి కొండపైన, కొండ దిగువ భాగంలో తాత్కాలిక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్
ఎస్.కోట మండలం పుణ్యగిరి శ్రీ ఉమా కోటిలింగేశ్వరర స్వామి మరియు సన్యాసయ్యపాలెం వద్ద సన్యాసేశ్వరస్వామి ఆలయాలకు ఫిబ్రవరి 26న జరిగే శివరాత్రి పర్వ దినాన భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసుశాఖ
ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఫిబ్రవరి 25న స్వయంగా పర్యవేక్షించారు.
ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ మరియు ఇతర పోలీసు అధికారులు పుణ్యగిరి కొండపైకి వెళ్ళి, శివుడ్ని దర్శించుకొని, పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ పరిసరాల్లో క్యూ లైన్లు ఏర్పాటు, భద్రత ఏర్పాట్లును, సిసి కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరును జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - శివరాత్రి పర్వదినాన పుణ్యగిరి మరియు సన్యానయ్య పాలెంకు సుమారు లక్షన్నర భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున, సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. విజయనగరం మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి నుండి పుణ్యగిరికి వచ్చే ప్రత్యేక ఆర్టీసి బస్సులను పుణ్యగిరి కొండ వరకు అనుమతిస్తామన్నారు. ఆటోలు మరియు వాహనాలను ఎస్.కోట వరకు అనుమతించి, వాటిని పార్కింగు చేసేందుకు ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లోకి అనుమతిస్తామన్నారు. వాహనాల పార్కింగుకు ఎస్.కోటలోని నందిత హెరీటల్ వెనుక భాగం
లోను, పంచాయతీ పార్కు, జి.జె. కాలేజ్ గ్రౌండు, అలంకార్ థియేటరు, మయూరి ఇన్ స్టే హెూటల్ ఎదురుగాగల ఖాళీ స్థలం, ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఖాళీ స్థలాలను వాహనాల పార్కింగుకు కేటాయించామన్నారు. పుణ్యగిరి కొండపైన
ప్రధాన ఆలయం, క్యూ లైన్లు, పుట్టదార, కోటి లింగాల రేవు, దారగంగమ్మ ప్రాంతాల వద్ద బందోబస్తు ఏర్పాటుపై అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేసారు. భద్రత ఏర్పాట్లును పోలీసు అధికారులు పర్యవేక్షించేందుకు పుణ్యగిరి కొండపైన, కొండ దిగువన తాత్కాలిక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. పుణ్యగిరి మార్గంలోను, ఎస్.కోట పట్టణంలోను ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను డైవర్టు చేసేందుకు పాయింట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రెగ్యులేషను చేసేందుకు దేవి బొమ్మ జంక్షను నుండి రైల్వే గేటు వరకు, రైల్వే గేటు నుండి పుణ్యగిరి వరకు, ఒన్ వే ట్రాఫిక్ జంక్షను నుండి ప్రకాశం పార్కు వరకు మూడు మూవింగు పార్టీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎగ్జిబిషన్స్ నిర్వహించే రైతు బజారు, ఆకుల డిపోల వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. సుమారు 300మంది పోలీసులు, 100మంది ఎన్.సి.సి. క్యాడట్లతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

జిల్లా ఎస్పీ వెంట విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.కోట ఎస్ఐలు సిహెచ్. గంగరాజు, శ్రీనివాసరావు, మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగు కేంద్రం పరిశీలన

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.**

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఈ నెల 27న జిల్లాలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎస్.కోట పట్టణం పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఫిబ్రవరి 25న సందర్శించి, భద్రత ఏర్పాట్లును పరిశీలించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను ఈ నెల 27న నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్.కోట పట్టణంలో పోలింగు నిర్వహించే పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి, పోలింగు కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఎన్నిక సజావుగా, ప్రశాంతయుతంగా, పారదర్శకంగా జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలింగు కేంద్రంకు చుట్టు ప్రక్కల గుంపులుగా ప్రజలు గుమిగూడి ఉండకుండా చూడాలని, ఓటు హక్కు లేని వారిని, అనధికార వ్యక్తులను, వాహనాలను పోలింగు కేంద్రం పరిసరాల్లోకి అనుమతించ వద్దని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.కోట ఎస్ఐలు సిహెచ్. గంగరాజు, శ్రీనివాసరావు, మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# జిల్లాలోని ఆలయాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

**కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్..**
**పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం,**
**సామర్లకోట శ్రీ కుమారారా భీమేశ్వర స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు..**

**కాకినాడ, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాలతో పాటు పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట శ్రీ కుమారారామా భీమేశ్వర స్వామి ఆలయాలలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపారు. బుధవారం మహా శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న సామర్లకోట, పిఠాపురం లలో అదనపు ఎస్పీ తో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని ఇతర ముఖ్య దేవాలయాల్లో కూడా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా దైవ దర్శనం సజావుగా జరిగేల సిబ్బంది విధి నిర్వహణ చేయాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ సిబ్బంది భక్తుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి, క్యూ లైన్లలో భక్తులు దేవాలయం లోకి ప్రవేశించేలాగా చూడాలని అన్నారు. డ్రోన్, సీసీ కెమెరాలు ద్వారా ఎప్పటి కప్పుడు రద్దీని అంచనా వేస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, విధి నిర్వహణ చేయాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పి సూచించారు. భక్తులందరూ తమ పిల్లలను, వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్లు డయల్ 100 లేదా 112, కాకినాడ జిల్లా ఎస్పీ వాట్సప్ హెల్ప్ లైన్ నెంబర్ 9494933233 లకు 24 గంటలు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని పేర్కొన్నారు.



## ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** ఆరోగ్య బీమా పథకం కోసం ఎన్నికల ప్రచారంలో చెప్పినది చెప్పినట్టుగా ఆరోగ్య బీమా పథకాన్ని ప్రతి కుటుంబంలో నలుగురు లేదా ఐదు మందికి దాదాపు 25 లక్షల దాకా అంటే ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున ఆరోగ్య బీమా వర్తించే విధంగా చెప్పడం జరిగినది అదేవిధంగా నిన్న జరిగినటువంటి ఆంధ్ర ప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ బిల్లును ప్రవేశ పెట్టడం జరిగినది అదేవిధంగా ఆ బిల్లును గవర్నర్ అబ్దుల్ నజీర్ అమలు చేయడం జరిగినది కావున ప్రజల ఆరోగ్యం కొరకు ఎంతో ఉన్నత స్థాయిని నియమించినందుకు పామిడి పట్టణ జనసేన పార్టీ నాయకులు %ఉ% కార్యకర్తలు జనసైనికులు సంతోషన్నీ వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వడ్డే రాము జి.కొట్టాల సూర్యనారాయణ, నక్కల రామాంజనేయులు, శరత్ కుమార్, జమీర్ రోషన్, సూర్య ప్రకాష్, ఖాజావలి, షేక్షావల్లి, జి కొట్టాల రామాంజనేయులు, వీర ప్రతాప్, రాజు, నవీను, నాగేంద్ర, తదితరులు పాల్గొనడం జరిగినది

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్.. వీరబాబు** ఈరోజు ప్రత్తిపాడులోని ప్రగతి, నైపుణ్య, అఖిల్, మినర్వా కాలేజీలలో నియోజకవర్గ పరిశీలకులు శ్రీ మెట్ల రమణ బాబు గారు మరియు ఎన్డీయే కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారు. ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి శ్రీ పేరాబత్తుల రాజశేఖరం గారికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా కోరిన ఎమ్మెల్యే. కూటమి ప్రభుత్వం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి మరింత బలాన్ని చేకూర్చేవలసిందిగా కోరడమైనది.

## విజయగౌరి "నే గెలిపించండి పిడిఎఫ్ ప్రజా సంఘాల విజ్ఞప్తి...




**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్: ప్రజా ప్రతినిధి:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న విజయగౌరి నే గెలిపించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ కోరారు విజయ గౌరి గెలుపు కోసం %ఖుఖీ% మండల నాయకులతో విస్తృత ప్రచారం నిర్వహించారు గెలుపు కోసం యుటిఎఫ్ మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చివర రోజు విస్తృత ప్రకారం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగా ఉన్న విజయగౌరికి ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే నిరంతరం మీ సమస్యలపై పోరాడేందుకు ముందుంటారన్నారు 35 సంవత్సరాల ఉద్యమ చరిత్ర గల బిజీగా ఎవరిని గెలిపించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఇమందిజగదీష్, యుటిఎఫ్ కోసాధికారి పొట్నూరు చిరంజీవి, సహాధ్యక్షులు దొడ్డి ప్రసాద్, ఎస్ వి ఎన్ స్వామి, సతీష్ సురేష్ తదితర ఉపాధ్యాయులు ప్రచారంలో పాల్గొన్నారు.

## మరణించిన హెూంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం.. జిల్లా ఎస్పీతుహిన్ సిన్హా అందజేత..



అనకాపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి) అనకాపల్లి జిల్లా నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన గవ్వ బాబురావు భార్య గవ్వ వీరలక్ష్మికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులు ఒక రోజు వేతనం మరియు ఇతర ఆర్థిక సహాయం కలిపి మొత్తం 4,12,140 రూపాయల చెక్ రూపంలో అందజేశారు. ఈ చెక్కును అనకాపల్లి జిల్లా ఎస్పీతుహిన్ సిన్హా తన కార్యాలయంలో మంగళవారం గవ్వ వీరలక్ష్మికి అందజేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులలో విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలలో పనిచేస్తున్న హెూంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందిస్తున్నారు. కార్యక్రమంలో ఏ.రామ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రత..





**ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్..**

**పట్టిసీమ లో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ..**

**పోలవరం, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** పోలవరం మండలం పట్టిసీమ లో వేంచేసి ఉన్న శ్రీ వీరేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పండుగ నేపథ్యంలో భక్త జన సందోహానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు.దేవస్థానం వద్ద మహా శివరాత్రి పండుగ సందర్భంగా భక్తుల భారీ సంఖ్యలో రద్దీ ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో , భద్రతా ఏర్పాట్లను ప్రతాప్ శివకిషోర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎస్పీ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి బందోబస్తు కోసం నియమించబడిన సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దైవ దర్శనం జరిగేలగా సిబ్బంది ఉద్యోగ నిర్వహణ చేయాలని భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని క్యూ లైన్ లలో భక్తులు దేవాలయం లోకి ప్రవేశించే విధంగా చూడాలని, డ్రోన్, మరియు సీసీ కెమెరాలు ద్వారా ఎప్పటి కప్పుడు రద్దీని అంచనా వేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని,నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే స్నానం చేయాలని ఎస్పీ సూచించారు.భక్తుల రద్దీ అధికంగా ఉండే కారణంగా, సక్రమంగా క్యూ లో నిలిచి తోపులటకు తావు లేకుండా దర్శనం చేసుకోవాలని పేర్కొన్నారు.

భక్తులు తమ పిల్లలను, అలాగే వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు. దేవాదాయ, విద్యుత్ శాఖ అధికారులు, నీటిపారుదల మరియు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి ధాత్రి రెడ్డి ఈ సందర్భంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు, పోలవరం డి.ఎస్.పి ఎం వెంకటేశ్వరరావు,పోలవరం ఇన్స్పెక్టర్ బాలసురేష్ బాబు సిఐలు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పాతపట్నం, మెలియాపుట్టి, మండలాల పశు వైద్య సిబ్బందితో సమీక్ష చేస్తున్న ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు.



**పాతపట్నం ఫిబ్రవరి25,ప్రజా జ్యోతి న్యూస్..** 21వ అఖిలభారత పశుగణన మార్చి 31 వ తారీకు వరకు పొడిగించినట్లు పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ రావు చెప్పారు. పాతపట్నం మరియు మెలియాపుట్టి మండలాల పశు వైద్యాధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుతో పూర్తి కావలసిన పశుగణన మార్చి నెల వరకు పొడిగించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క ఎన్యుమేటర్ తనకు కేటాయించిన గ్రామాలను పూర్తిస్థాయిలో సర్వే జరిపి మార్చి 15వ తారీకు లోపు పశు గణన పూర్తి చేయాలని, 15వ తారీకు తర్వాత సూపర్వైజర్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు . పశు బీమాలో రెండు మండలాల పరిధిలో 84 పాడి పశువులకు ఈ విడత బీమా చేయించడం జరిగిందని ,మళ్లీ ప్రభుత్వ సబ్సిడీ రాగానే మిగిలిన పశువులకు ఇన్సూరెన్స్ చేయించడం జరుగుతుందని చెప్పారు. సెక్స్ సా ర్టెడ్ సెమెన్ వినియోగంలో అందరు కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పశుగ్రాస పెంపకాన్ని అందరు రైతులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మార్చి ఒకటో తారీకు నుండి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. బ్రూసిల్లా వ్యాక్సిన్ కూడా అదే రోజు నుండి నాలుగు మాసాలు దాటిన ఆడదూ డ ల కు వేయడం జరుగుతుందని చెప్పారు .ఏపీ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కింద మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వడానికి పాతపట్నం మండలంలో ఎక్కువగా పాల సేకరణ చేస్తున్న సీది గ్రామాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. మార్చి నెలలో దూడల పోటీలు మండలానికి ఒకటి చొప్పున నిర్వహించనున్నట్లు చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డ్స్ పాడి రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు .ఈ సమీక్ష సమావేశంలో పశు వైద్యాధికారులు డాక్టర్ పి అనిల్ (కొ రసవాడ )డాక్టర్ కే మౌనిక (సీధి )మరియు పాతపట్నం ,మెలియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ





**తల్లిదంద్రులకు, ఉపాధ్యాయులకు పాదపూజ.**

**ఇండస్ ప్రతిభా విద్యార్థికి అభినందనలు.**



**పాతపట్నం ఫిబ్రవరి25, ప్రజా జ్యోతి న్యూస్** శ్రీకాకుళం జిల్లా, సారవకోట మండలం, చిన్న కిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగతముడి రమేష్ అధ్యక్షతన, పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యా అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.మార్చి నెలలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు, విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామాగ్రిని ట్రస్ట్ తరపున అందజేయడమైనది. 10వ తరగతి విద్యార్థుల చే వారి తల్లిదంద్రులకు, వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించడమైనది. పాతపట్నం మండలం రొంపి వలస ఉన్నత పాఠశాలలో ఇటీవల 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇండాస్ ప్రతిభ పరీక్షలో చిన్న కి ట్టాలపాడు పాఠశాలకు చెందిన విద్యార్థి కె. హర్షవర్ధనకు తృతీయ బహుమతి వచ్చిన సందర్భంగా ట్రస్ట్ తరపున అభినందిస్తూ, తల్లిదంద్రులకు సన్మానం చేయడమైనది.ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి మడ్డు వెంకటరమణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భయంలేకుండా ఆత్మవిశ్వాసముతో పరీక్ష వ్రాయాలి అని అన్నారు.విశిష్ట అతిథిగా రిటైర్డ్ గ్రేడ్ వన్ తెలుగు పండితులు బందన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైతిక ప్రవర్తన అలవర్చుకోవాలని అని అన్నారు.ట్రస్ట్ అధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదంద్రులను, విద్యాబుద్ధులను నేర్పిన గురువులను కాటికి పోయేవరకు ,కంటికి రెప్పలా చూసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సురవరపు స్వాతి ,వైస్ చైర్మన్ కరిమెళ్ళ సుదర్శన్ రావు, ఉపాధ్యాయులు ఎన్. చంద్రమోహన్, డి. వెంకటేశ్వరరావు, కె.వి.రమణమూర్తి, ఓ.రామయ్య,, ఓజోగారావు, కె.విన్నారావు,జి. రామరాజు, పి.వేణు, విద్యార్థుల తల్లిదంద్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ (టీచర్స్ ) ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన.

**పాతపట్నం ఫిబ్రవరి25, ప్రజా జ్యోతి న్యూస్** ఈ నెల 27 వ తేదీన జరుగనున్న శ్రీకాకుళం – విజయనగరం – విశాఖపట్నం శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబందించి పాతపట్నం మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ వారు, తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ , పరిశీలించడం జరిగింది. ఈ ఎన్నికల లో పై పోలింగ్ కేంద్రంలో 270 మంది ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవడం జరిగింది. పోలింగ్ 27 వ తేదీ ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తహసీల్దార్ తెలియచేసారు.



## పట్టణంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్.. 20 ద్విచక్ర వాహనాలు సీజ్



**కాకినాడ, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల తో కాకినాడ ఏ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మహాలక్ష్మి నగర్, ప్రదీప్ నగర్, పగడాల పేటలలో తనిఖీ లలో రికార్డు లేని 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో తిమ్మాపురం ట్రైనీ ఏ ఎస్ పి కుమారిసుష్మిత, కాకినాడ రూరల్ ఇన్స్పెక్టర్ డిఎస్ చైతన్య కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, కోరింగ ఎస్సై సత్యనారాయణ, ఎస్సైలు మూర్తి, ప్రసాద్, సూర్యకుమార్ సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ పగడ్బందీగా చేర్చాలి..

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్..**



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** గ్రాడ్యుయేట్ ఎన్నికల పొలింగ్ కేంద్రాలకు పొలింగ్ మెటీరియల్ అత్యంత పక్బందీగా తరలించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు.స్థానిక అర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సహయ రిటర్నింగ్ అధికారి టి సీతారామ మూర్తి , ఆర్డీఓ కృష్ణ నాయక్, తహసిల్దార్ పాపా రావు తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్టాట్యూటరీ , నాన్ స్టాట్యూటరీ ఫారాలను ఆయా పొలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 92 పొలింగ్ కేంద్రాలకు 15 రూట్ ల ద్వారా పొలింగ్ కేంద్రాలకు సిబ్బందికి, మెటీరియల్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పొలింగ్ నిర్వహించే సిబ్బంది , భద్రతా సిబ్బంది ముందుగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సాయింత్రం లోగా ఆయా పొలింగ్ కేంద్రాలకు చేరుకునేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సజావుగా ఎన్నికలు నిర్వహణ కోసం 400 మంది పోలీసులు నియమించడం జరిగిందన్నారు. మొత్తం 62970 ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 36,366 మంది, స్త్రీలు 27,601 మంది ఇతరులు ముగ్గురు ఉన్నారన్నారు. రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## పిఠాపురం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో.. మర్రెడ్డి శ్రీనివాసరావు..



**గొల్లప్రోలు ఫిబ్రవరి 25:-( ప్రజాజ్యోతి )రిపోర్టర్ చినబాబు..** పిఠాపురం ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎలక్షన్ క్యాంపిగ్ లొ భాగంగ పేరాబత్తుల రాజశేఖరం కి మొదటి మొదటి ప్రాధాన్యత ను ఇచ్చి కూటమి అభ్యర్థి ని భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్ల ప్రచారంలో పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు ఎమ్మెల్సీ ప్రచారానికి వచ్చిన శ్రీనివాసరావుకి హారతులతో ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ బిసి లీడర్ నక్క వీరభద్రి భారీ ఎత్తున జనసేన నాయకులు వీర మహిళలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అశ్లీల నృత్యా ప్రదర్శనలు చేస్తే కఠిన చర్యలు..

ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా..
జిల్లా ఎస్పీ తుషార్ డూడీ..




**బాపట్ల జిల్లా ఫిబ్రవరి 25:-( ప్రజా జ్యోతి )స్టాఫ్ రిపోర్టర్** ఆలయ పరిసర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఐపీఎస్ తెలిపారు. మంగళవారం చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో సోపిరాల గ్రామంలోని శ్రీ రామ కోటేశ్వర స్వామి దేవాలయం, కొత్తపాలెం గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవాలయలను ఎస్పీ సందర్శించారు. ఫిబ్రవరి 26 న శివరాత్రి పండుగ సందర్భంగా తీసుకుంటున్న భద్రత పరమైన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. క్యూ లైన్ ల నిర్వహణ, బారిగేట్స్ ఏర్పాట్లను, భక్తులు దేవాలయాలలోకి ప్రవేశించు, బయటకి వచ్చు మార్గాలను పరిశీలించారు. డెకరేషన్ లైటింగ్ ఏర్పాటు చేసే ప్రదేశాలలో, విద్యుత్ ప్రభల కరెంట్ వైర్ల వద్దకు భక్తులు, పిల్లలు వెళ్లకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సాధారణ దుస్తులలో కూడా పోలీస్ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శివాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. సోపిరాల గ్రామంలోని శ్రీ రామ కోటేశ్వర స్వామి దేవాలయం, కొత్తపాలెం గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవాలయలకు మహా శివరాత్రి సందర్భంగా సుమారు 80, వేల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా అంచనా వేస్తున్నామని తెలిపారు దానికి అనుగుణంగా చీరాల డిఎస్పీ మోయిన్ ఆధ్వర్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 130 మంది పోలీసులను బందోబస్తు విధులకు వినియోగిస్తున్నమన్నారు. వీరిలో ఒక ట్రైనీ డిఎస్పీ, ముగ్గురు సీఐలు, 9 మంది ఎస్ఐలు ఉన్నారన్నారు. నిఘా కోసం ఆలయాల పరిసర ప్రాంతాలలో 30 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, రెండు డ్రోన్లను కూడా వినియోగించుకోనున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకున్నామని, వాహనాల పార్కింగ్ కి అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. అమర్తలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవాడ గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దర్శనానికి సుమారు లక్ష మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నామని, రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు సారధ్యంలో ముగ్గురు సిఐ లు, ఆరుగురు ఎస్సై లతో కలిపి సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గోవాడ గ్రామంలో ఆలయ పరిసర ప్రాంతాలలో 50 సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు సూచనలు, హెచ్చరికలు, ఆదేశాలు జారీచేసేందుకు ప్రతి చోట పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రశాంత వాతావరణంలో మహా శివరాత్రి ఉత్సవాలు జరిగేవిధంగా భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించుకొనే కళాప్రదర్శనలు, నాటకాలలో అస్లీల నృత్య ప్రదర్శనలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ మోయిన్, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఇంకొల్లు సిఐ రమణయ్య, చిన్నగంజాం ఎస్.ఐ రమేష్ దేవాలయ కమిటీ ఛైర్మెన్ లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన బాధ్యత అధికారులదే..

సి సి ఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి..
అమరావతి నుంచి ముఖ్య కమిషనర్ కలెక్టర్లతో వీక్షణ..




బాపట్ల, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) ప్రభుత్వ భూములు, ఆస్తులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉందని సి సి ఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి పేర్కొన్నారు. రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సి సి ఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. ప్రభుత్వ భూములన్నిటిని పూర్తిస్థాయిలో గుర్తించడానికి రీ సర్వే చేయాలని జయలక్ష్మి ఆదేశించారు. రీ సర్వే చేస్తున్న సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవిన్యూ సదస్సుల్లో నమోదైన దరఖాస్తుల పరిష్కారంలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో నిలిచిందన్నారు. కేవలం 4.93 శాతం దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. అందరికీ గృహాలు కార్యక్రమాన్ని కలెక్టర్లు సమర్ధంగా చేపట్టాలని ఆమె సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నమోదయ్యే అర్జీలను పున పరిశీలన చేయాలన్నారు. భూముల రీ సర్వే, తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్లతో ఆమె చర్చించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించకుండా పర్యావరణం కాపాడాలి..

మున్సిపల్ కమిషనర్ రఘునాధ రెడ్డి..
బాపట్ల మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ పర్యటన..




**బాపట్ల, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**
ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించకుండా ప్రజలు పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించాలని మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలువార్డుల లో మంగళవారం ఉదయం ఆయన పర్యటించారు. తెల్లవారుజామున పటేల్ నగర్ వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేసి కార్మికులకు పలు సూచనలు చేశారు. నిర్దేశించిన సమయంలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ జరగాలని సమయపాలన పాటించాలని ఆదేశించారు.తడి చెత్త,పొడి చెత్త మరియు హానికర వ్యర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి హెూమ్ కంపోస్టింగ్ విధానం అమలు పరచాలని పేర్కొన్నారు.ప్లాస్టిక్ కవర్ లు ఉపయోగించకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. సోర్స్ సెగ్రిగేషన్ విషయంలో 100 శాతం బాపట్ల పురపాలక సంఘాన్ని అగ్రగామి అయ్యేలా కృషి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్ నగర్ కాలనీ వద్ద పైప్ లైన్ లీకేజీని పరిశీలించి త్వరితగతిన పైపులైను లీకేజీ పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మూర్తి రక్షణ నగర్ మరియు చిన్న యాదవ పాలెం లో పర్యటించి నీటి సరఫరా విషయమై ప్రజలనే నేరుగా అడిగి వివరాలు తెలుసుకున్నారు.అన్న క్యాంటీన్ ను సందర్శించి పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని,క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ కి వచ్చే ప్రజలకు శుభ్రమైన త్రాగునీరు అందించాలని అన్నారు. అనంతరం విశ్వబ్రాహ్మణ కాలనీ లో ఉన్న పురపాలక సంఘ పార్కును పరిశీలించిన్న ఆయన పార్కు లో జరుగుచున్న సుందరీకరణ పనుల గురించి ఇంజనీరింగ్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పార్కు సుందరీకరణ పనులను పూర్తి చేసి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీరు .జి.ప్రసాద్, పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

## కృష్ణ గుంటూరు శాసనమండలి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
ఎన్నికల నిర్వహణపై పరిశీలకులు కరుణ వీక్షణ సమావేశం..



**బాపట్ల, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** కృష్ణ, గుంటూరు శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నిక పరిశీలకులు వి కరుణ తెలిపారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై కృష్ణా, గుంటూరు నియోజకవర్గంలోని జిల్లా కలెక్టర్లతో ఎన్నికల పరిశీలకులు కరుణ మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. శాసనమండలి ఎన్నికలు సజావుగా జరగడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కరుణ సూచించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి హాజరయ్యారు. శాసనమండలి ఎన్నికలు సమర్ధంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు అధికారులు, ఉద్యోగులను నియమించామన్నారు. ఎన్నికల సామాగ్రి అన్ని కేంద్రాలకు తరలిస్తున్నామని చెప్పారు. సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 27- 2- 2025 వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై ఐదు మండలలా నాయకులతో సమీక్ష నిర్వహించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు



పాకలపాటి రఘువర్మ గారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఎంజీఆర్.. ఉపాధ్యాయుల ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ఏర్పడింది అలాగే ఇప్పుడు కూడా పాకలపాటి రఘువర్మ ని గెలిపించాలని కోరుకుంటున్నాం.

**పాతపట్నం ఫిబ్రవరి 25ప్రజా జ్యోతి న్యూస్..** శ్రీకాకుళం,విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు వారి కార్యాలయంలో నియోజకవర్గం లో ఐదు మండలాలకు చెందిన కూటమి ముఖ్య నాయుకులతో సమావేశం ఎర్పాటు చేసిన గౌరవ శాసనసభ్యులు మామిడి గోవిందరావు.కూటమి ప్రభుత్వం బలపరిచినటువంటి ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు కష్టపడి పని చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కూటమి నాయుకులు తదితరులు పాల్గొన్నారు.లి

## జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా సమన్వయకర్తగా కొరికాన రవికుమార్..



**పాతపట్నం ఫిబ్రవరి25 ప్రజా జ్యోతి న్యూస్.** జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్తగా సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. మార్చి 14న పిఠాపురంలో డిప్యూటీ సీఎం, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించబోయే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ సమన్వయకర్తలను నియమించారు. నియోజకవర్గ పార్టీ ఇన్చార్జిలు, పీవోసీలు, మండల అధ్యక్షులతో సమావేశాలు నిర్వహించి ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేసే బాధ్యతను పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలకు అప్పగించారు. సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ ను పార్టీ సమన్వయకర్తగా నియమించడం పట్ల ఆ పార్టీ నాయకులు, ఇన్చార్జిలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## స్పటిక శివలింగ ప్రతిష్టాపన మహెూత్సవంలో పాల్గొన్న సిరిపురం తేజేశ్వరావు..



**పాతపట్నం ఫిబ్రవరి25, ప్రజా జ్యోతి న్యూస్..** బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మంగళవారం నాడు ఉదయం పాతపట్నం లో ఉన్న శ్రీ చంద్రశేఖర స్వామివారి ఆలయంలో స్పటికలింగం ప్రతిష్టాపనా మహెూత్సవం లో పాల్గున్నారు. అక్కడ భక్తులు ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు, బడియాల బాబురావు, పైల భాస్కరరావు గారు,ప్రసన్న కుమార్ పండా, రవీంద్రకుమార్ పండా, జనసేన నాయకులు నక్క క్రాంతి, తలగపూ నవీన్, అవినాష్ పాల్గున్నారు....

## జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు..



**పాతపట్నం ఫిబ్రవరి25, ప్రజా జ్యోతి న్యూస్ .** రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను కాల పరిమితి దాటిపోకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. తాసిల్దార్ లు లబ్ధిదారుని స్వంత స్త లాలను పరిశీలించి పొజిషన్ ధృవపత్రాలు మంజూరు చేయాలని కోరారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఏపీఓలను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల హాజరును ప్రతిరోజు పరిశీలించాలని, సంబంధిత మండల స్థాయి అధికారులు దానికి పూర్తి బాధ్యత వహించాలని కోరారు. అంగన్వాడి కేంద్రాలలో టాయిలెట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈలను ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు%

## విక్టరీ స్కూల్లో వేడుకగా వీడ్కోలు కార్యక్రమం..




**పాతపట్నం ఫిబ్రవరి25, ప్రజా జ్యోతి న్యూస్** విక్టరీ పాఠశాలలో పదో తరగతి పిల్లలకు తొమ్మిదవ తరగతి వాళ్ళు జరిపిన వీడ్కోలు కార్యక్రమం ఆద్యంతం ఆనందకరంగా, ఉల్లాసభరితంగా సాగింది.పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి పాఠశాల కు మంచి పేరు తేవాలని ప్రిన్సిపాల్ శంకరనారాయణ తెలిపారు.పై చదువులకు వెళ్లిన ఇక్కడ నేర్చిన క్రమశిక్షణ అక్కడా చూపాలని,మంచి పేరు తెచ్చుకోవాలని డైరెక్టర్ తారకేశ్వరరావు హితవు పలికారు.గడచిన ముప్పై యేళ్ళకు పైగా విక్టరీ స్కూల్ కి ఘనమైన పేరు ఉందని,ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని,దాన్ని మీరూ సాధించాలని మరో డైరెక్టర్ అప్పారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారుగా సాగి ఆహుతులను అలరించాయి.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కుందేరు వాగు ఆక్రమణ తొలగింపుకు చర్యలు..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
రెవెన్యూ,డ్రైనేజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష..
వాగుకు రెండు వైపులా ఆక్రమణలు తొలగించాలి..
అధికారులకు కలెక్టర్ ఆదేశాలు..



బాపట్ల, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) కుందేరు వాగు ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో కుందేరు వాగు ఆక్రమణలు తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యల పై రెవెన్యూ ,డ్రైనేజ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుందేరువాగు జిల్లాలో బాపట్ల, చీరాల, చిన్నగంజాం, వేటపాలెం మండలాలలో ప్రవహిస్తుందన్నారు. ఆయా మండలాల్లోని కుందేరు వాగు సర్వే పై తాసిల్దార్లను ఆరా తీశారు. కుందేలు వాగు బాపట్ల మండలంలో 97.20 ఎకరాలు, చీరాల మండలంలో 267 ఎకరాలు, చినగంజాం మండలంలో 460 ఎకరాలు, వేటపాలెంలో 650 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. వాగుకు ఇరువైపులా ఆక్రమణలు కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. వాగుకు ఇరువైపులా ఉద్యానవన పంటలు, వ్యవసాయ పంటలు వేసిన వారితో మాట్లాడి వాటిని కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.వాగుపై కట్టడాలు ఉన్న వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కుందేరు వాగులో ఉన్న చెట్ల వేలం పై సంబంధిత డ్రైనేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆరా తీశారు. చెట్ల వేలంను త్వరితగతిన పూర్తి చేసి వాటిని తొలగించాలని ఆయన ఆదేశించారు. వేలం ద్వారా వచ్చిన నిధులను కాలువ మరమ్మత్తులకు ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలో కుందేరు వాగు ఆక్రమణల తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, డ్రైనేజ్ శాఖ ఇంజనీర్ మురళి కృష్ణ, బాపట్ల తహసిల్దార్ సలీమా, చీరాల తహసీల్దార్ గోపికృష్ణ, చిన్నగంజాం తాసిల్దార్ ప్రభాకర్ రావు, వేటపాలెం తాసిల్దార్ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చికెన్ కోడిగ్రుడ్లు మేళ..

ఎన్నో ప్రోటీన్లు కలిగిన చికెన్ వినియోగించండి..
జిల్లా కలెక్టర్ జై వెంకట మురళి..



**బాపట్ల జిల్లా ఫిబ్రవరి 25:-( ప్రజా జ్యోతి )స్టాఫ్ రిపోర్టర్** చికెన్ అందరూ తినండి అపోహలు వద్దు ఎలాంటి హాని లేదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్లో చికెన్ మరియు కోడి గ్రుడ్లు మేళా కార్యక్రమం మంగళవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ జిల్లా అధికారులు హాజరయ్యారు చికెన్ తో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను అధికారులు అందరూ ధైర్యంగా తినాలని కలెక్టర్ సూచించారు. అపోహలు మాని ఎంతో విలువైన ప్రోటీన్ లు ఉండే చికెన్ వినియోగించాలని చెప్పారు. చికెన్ తినడం వల్ల జీబీఎస్ వ్యాధి శోకదని, ఎలాంటి అనారోగ్యం రాదని తెలిపారు అందరికీ ఆదర్శంగా ఉండాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసేమని చెప్పారు అత్యధికమైన వేడిలో ఉడికించడం ద్వారా బ్యాక్టీరియా చనిపోతుందని సూచించారు ప్రజలు అపోహలు మాని భయపడకుండా చికెన్ తినాలని చెప్పారు అపోహలతో పౌల్ట్రీ వ్యాపారాలకు నష్టం వాటిల్లిందని అవగాహనతో చికెన్ వినియోగించాలని కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పౌల్ట్రీ వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు

## శివాలయం వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి



**బద్వేల్, ఫిబ్రవరి 25,(ప్రజా జ్యోతి న్యూస్ ):** మహాశివరాత్రి పురస్కరించుకొని బద్వేల్ రూపరాంపేట శివాలయం వద్ద మంగళవారం మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమం లో శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమణయ్య, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని మెజారిటీతో గెలిపించాలి..

కార్యకర్తలు నాయకులు సమన్వయంతో ఎమ్మెల్సీ గెలుపు దిశగా పనిచేయాలి...
జనసేన సమన్వయకర్త శివన్నారాయణ..



**బాపట్ల జిల్లా ఫిబ్రవరి 25:-( ప్రజా జ్యోతి )స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ న్నారాయణ పత్రిక విలేకరుల సమావేశం లో పాల్గొన్నారు ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ కృష్ణ ఉమ్మడి గుంటూరు జిల్లాల పట్టబుద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మద్దతిస్తూ వారిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు ఆలపాటి రాజా గెలుపె లక్ష్యంగా మనందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించారు ఈ కార్యక్రమంలో బాపట్ల రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు దాసరి యేసుబాబు, పిట్లవాని పాలెం మండల అధ్యక్షులు హుస్సేన్ బ్యాగ్ ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు మరియు బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ సభ్యురాలు అగిశెట్టి విజయ మాధురి, లీగల్ సెల్ కత్తి నాగలక్ష్మి, కొక్కిరాల రాజేంద్ర, షేక్ కరీముల్లా, జిడుగు రాజేష్ కుమార్, ఆగిశెట్టి శ్రీకాంత్, ఆకుల కోటేశ్వరరావు, చర్లపల్లి ఏసోబు, నాయుడు ఆనంద్, సయ్యద్ అన్సారి, షేక్ రఫీ, నామన శ్యామ్ కుమార్, గంట నాగమల్లేశ్వరరావు, సయ్యారం వంశీ కిరణ్, సిహెచ్ సత్యనారాయణ, సిహెచ్ సాయి మురళి, మరియు జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**కనిగిరి ఫిబ్రవరి 25** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రాముఖ్యమైనదని, శివపార్వతుల వివాహం జరిగిన రోజు మహాశివరాత్రి అని, పరమశివుడు కైలాస పర్వతంతో ఒకటై పరిపూర్ణ నిశ్చలత్వంతో పర్వతంలా మారిన రోజు అని, మహాశివరాత్రి రోజున శైవ క్షేత్రాలు శివనామస్మరణంతో మారుమ్రోగుతాయని, భైరవకోన, మిట్టపాలెం నారాయణ స్వామి, నియోజకవర్గంలోని శివాలయాలలో భక్తులు శివపార్వతులను దర్శించుకుని పార్వతీ పరమేశ్వరుల కృపకు పాత్రులు కాగలరని దారపనేని ఆకాంక్షించారు.

## శ్రీ ఈక్షణ ముక్తేశ్వర స్వామి ని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు.



**కాకినాడ జిల్లా ఫిబ్రవరి 25:** పెదపూడి మండలం సంపర లో శ్రీ ఈక్షణ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీ ఈక్షణ ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల NDA నాయకులు, సంపర ముక్తేశ్వర గ్రామ NDA నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించిన పరిటాల, అమిలినేని కుటుంబసభ్యులు





**అనంతపురం ఫిబ్రవరి 25:** అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం, కంబదూరు మండల కేంద్రంలో కొలువైఉన్న పురాతన మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో జరిగిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి కుటుంబ సభ్యులతో కలసి హాజరైన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ గారు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు.. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు గారి కుటుంబ సభ్యులు, పరిటాల సునీతమ్మ గారి కుటుంబ సభ్యులు శివపార్వతులకు పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు, పరిటాల జ్ఞాన పార్వతీదేవి కి వడిబియ్యం సమర్పించడం జరిగింది... ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక నాయకులు పాల్గొనడం జరిగింది..

## వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి చక్రస్నానం

**తిరుపతి ఫిబ్రవరి 25:** తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం 10.40 గంటలకు చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు అర్చకులు అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. ఎవరైతే బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకొంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారు. రాత్రి 7.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ శ్రీమతి పుష్పలత, ఆలయ అర్చకులు ఇతర అదికారులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల్లో చేపలు పట్టే నైపుణ్యం ఉండాలి

-మత్స్యశాఖ డీడీ శ్రీనివాస నాయక్

**రాప్తాడు, ఫిబ్రవరి 25:** చేపలు పట్టడంలో మత్స్యకారులకు నైపుణ్యం ఖచ్చితంగా ఉండాలని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస నాయక్ తెలిపారు. రాప్తాడు గ్రామ చెరువు మత్స్య సహకార సంఘంలో నూతన సభ్యులుగా చేరడానికి రాప్తాడు చెరువులో మంగళవారం చేపలు పట్టే విధానంపై నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. చెరువులో ఈతకొట్టడం, పడవలో వెళ్తూ వల వేసుకుంటూ వెళ్లడం, వల లాగడం, వల విసరడం, వల కుట్టడం వంటి వాటిపై పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఏడీ చంద్రశేఖర్ రెడ్డి, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి ప్రభాకర్ రెడ్డి, మత్స్య అభివృద్ధి అధికారి పక్కీరయ్య, ఉమ్మడి మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు నగేష్, రాప్తాడు గ్రామ చెరువు సంఘం అధ్యక్షుడు జూటూరు రామకృష్ణ, రాప్తాడు గ్రామ సచివాలయం విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో చేనేత అభివృద్ధికి సాయమందిస్తాం

మంత్రి సవితతో గేర్జి టెక్స్ టైల్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి నవదీప్ సోధి



**అమరావతి, ఫిబ్రవరి 25:** ఆంధ్రప్రదేశ్ లో చేనేత పరిశ్రమ అభివృద్ధికి తమవంతు సహకారమందిస్తామని స్విట్జర్లాండ్ కు చెందిన గేర్జి టెక్స్ టైల్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి నవదీప్ సోధి తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత్ టెక్స్-2025లో కుదిరిన ఒప్పందాల్లో భాగంగా సోమవారం ఆయన మంత్రి సవితను అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఏపీలో టెక్స్ టైల్స్ పరిశ్రమ అభివృద్ధి కోసం పలు అంశాలతో కూడిన ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని గేర్జి టెక్స్ టైల్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి నవదీప్ సోధితో కలిసి మంత్రి సవిత కలిశారు. గేర్జి టెక్స్ టైల్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి నవదీప్ సోధి ప్రజంటేషన్ పై సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తంచేశారు. త్వరలో మరోసారి సమావేశమవుదామని సీఎం చంద్రబాబు సూచించారు.

## గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ.

**అనంతపురం, ఫిబ్రవరి 25 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలను మంగళవారం అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పాఠశాలలో భోజన వసతి ఏ విధంగా ఉంది, అన్ని వసతులు కలిపిస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ గురుకుల పాఠశాలలో చదివే ప్రతి పేద విద్యార్థికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిదీ విద్యార్థులకు సరైన సమయంలో అందజేయాలని ప్రిన్సిపల్ కి సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పిల్లలకు చక్కటి క్రమశిక్షణ నేర్పించాలని, పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచేటట్ల కృషి చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా భోజనం బాగున్నదని సంతృప్తిని వ్యక్తం చేశారు. చిన్న చిన్న మార్పులు చేస్తే భోజనం మరింత రుచిగా ఉంటుందని వంట వారికి సూచించారు. తాను ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని అధికారులకు మరియు ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలసి ఎంపీ భోజనం చేశారు. విద్యార్థులు ఏ సమయం అయినా ఏదైనా అవసరం ఉంటే తనను సంప్రదించవచ్చని తెలియజేశారు.

# సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం

**అనంతపురం ఫిబ్రవరి 25:** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా సైబర్ నేరాలు జరగడానికి వీలులేదని అందుకోసం పోలీస్ శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుందనిసైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే అవగాహన, అప్రమత్తతలే కీలకమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. సైబర్ సురక్ష (మన భద్రత- మన బాధ్యత)లో భాగంగా నార్పల మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో గ్రీన్ ఆర్మీ డిస్కవర్ అనంతపురం వారి ఆధ్వర్యంలో ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ జగదీష్ విద్యార్థుల్లో సైబర్ మోసాలపై అవగాహన చేశారు. జిల్లాలో సాధారణ దొంగతనాల కంటే సైబర్ నేరాల్లో ప్రజలు అధికంగా డబ్బు పోగొట్టుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలు అధికంగా చోటు చేసుకుంటున్న తరుణంలో జిల్లా ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన తీసుకురావడమే మా లక్ష్యమన్నారు. ముఖ్యంగా ... డిజిటల్ అరెస్టు/ ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్ , ఇన్వెస్ట్మెంట్ / క్రిప్టో/ స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ ... డెబిట్ / క్రెడిట్ కార్డు ఫ్రాడ్/ UPI ఫ్రాడ్ ... పార్ట్ టైం జాబ్ / టాస్క్ /జాబ్ ఫ్రాడ్ ... APK/ లింక్ / మెసేజీ ఫ్రాడ్... AEPS ఫ్రాడ్ , ఫేక్ లోన్ యాప్ ఫ్రాడ్స్, తదితర సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి... సైబర్ నేరగాళ్ల భారిన పడకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ఈ అవగాహన ద్వారా మీ కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల్లో చైతన్యం తేవాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలతో సైబర్ నేరాలు నిలువరించాలని... ఒకవేళ సైబర్ మోసగాళ్ళ బారిన పడిన వెంటనే మౌనం వీడి సైబర్ క్రైమ్ లిటోల్ ఫ్రీ నెంబర్ 1930 కు సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.in ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సైబర్ క్రైం అవేర్నెస్ పై 5 నిముషాల నిడివిగల చిన్న నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. సైబర్ నేరగాళ్లు మాయమాటలతో ప్రజలను (రైతులను) ఎలా మోసగించి డబ్బు కాజేస్తారు, ఆతర్వాత బాధితులు బ్యాంకుకెళ్లి మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో సైబర్ నేరగాళ్లు అరెస్టు చేయడం వరకు విద్యార్థులు ప్రదర్శించిన తీరు ఆలోచింపజేసింది.

# 48 గంటల్లో ఏడుగురు రైతుల ఆత్మహత్యలు

**ఎన్నికల ప్రచారంలో రేవంత్ బిజీ- కేటీఆర్**

**ఎస్ ఎల్ బి సి టన్నెల్‌లో ప్రమాదం**

**36వ సారి ఢిల్లీకి రేవంత్-కేటీఆర్**

**బీఆర్ఎస్‌లో చేరిన స్టేషన్ ఘన్ పూర్ కాంగ్రెస్ నాయకులు**

కేవలం 48 గంటల్లోనే రాష్ట్రంలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకొని ఉన్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోజుకు ఒక రైతు చొప్పున ఇప్పటివరకు 450 మంది రైతులు చనిపోయారని, అయినా రేవంత్ రెడ్డిలో కనీసం చలనం కూడా లేదని విమర్శించారు. ఒకప్పటి రోమ్ చక్రవర్తి నీరో లెక్కనే రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని, ఇప్పుడు 36వ సారి ఢిల్లీకి వెళ్లారని చెప్పారు. ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని, హోంశాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖలకు మంత్రులను కూడా నియమించుకోలేని అసమర్థుడైన రేవంత్ రెడ్డి, తెలంగాణ నుంచి కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తాడా అని ప్రశ్నించారు.

స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత మాజీ జిఖుఅ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డితో పాటు సుమారు 500 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వాళ్లను పార్టీలో సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్, 15 నెలల స్వల్ప కాలంలోనే అధికార పార్టీని వదిలి ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే కాంగ్రెస్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని, ఇది రాష్ట్రంలో వీస్తున్న గాలికి సంకేతమన్నారు. ఒక్క స్టేషన్ ఘన్పూర్ మాత్రమే కాదు, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు గెలిచినా ఓడినా ఫరక్‌లేదని రేవంత్ చిద్విలాసంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌కు నిద్రలో కూడా కేసీఆర్ గుర్తొస్తున్నారని, నిజానికి మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తాను ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ కలలో కూడా ఊహించలేదని ఎద్దేవా చేశారు. రైతు ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించడం కేసీఆర్ పాలన దక్షత, రైతులపై ప్రేమకు నిదర్శనమన్నారు కేటీఆర్. శివుడు గంగమ్మ తల్లిని దివి నుంచి గుడికి తీసుకొస్తే, కేసీఆర్ గోదావరి నదిని 80 మీటర్ల నుంచి 618 మీటర్ల పైకి తీసుకొచ్చి కొండపోచమ్మ సాగర్‌ను నింపారని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజ్‌లలో



340 పిల్లర్లు ఉండగా, ఒక పిల్లర్ పగిలితే కాంగ్రెస్ నాయకులు నానా యాగి చేశారని, కాంగ్రెస్ నాయకులు దున్నపోతు ఈనింది అంటే బీజేపీ వాళ్లు దుడ్డే కట్టేయమన్నట్టు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసి తెలంగాణ ప్రజల మనసుల్లో విష బీజాలు నాటారని ఆరోపించారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయినా, ఎస్ ఎల్ బి సి టన్నెల్ కూలిపోతే, ఖమ్మం పెద్దవాగు బ్రిడ్జి కొట్టుకపోతే ఏ బీజేపీ నాయకుడూ మాట్లాడడం లేదని, ఇవాళ రేవంత్ ప్రభుత్వానికి రక్షణ కవచంలా ప్రధాని మోడీ పనిచేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం పిల్లర్ పగిలినప్పుడు హడావుడి చేసిన ఎన్‌డీఏ, ఈ ప్రమాదాల విషయంలో మౌనంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంపై వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ కింద అడిగితే, దేశ భద్రతకు సంబంధించినదని రేవంత్ ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. తెలంగాణలో రాహుల్-రేవంత్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధానమంత్రి మోడీ ఆరోపించినా, ఇప్పటిదాకా బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రెండు కోట్ల లాభం మాత్రమే ఆర్జించిన రేవంత్ బామ్మర్దికి సంబంధించిన శోధా కంపెనీకి 1137 కోట్ల అమృత్ కాంట్రాక్టును రేవంత్ రెడ్డి అక్రమంగా కట్టబెట్టారని, దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా చర్యలు లేవని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు జరిగినా, ఇప్పటిదాకా ఏం జరిగిందో ఈడీ బయటపెట్టలేదన్నారు. తెల్లారితే కేసీఆర్‌ను విమర్శించే రేవంత్ రెడ్డి, బీజేపీని ఒక్క మాట కూడా అనడని, బీఆర్ఎస్, కేసీఆర్ ఉన్నంత వరకు కాంగ్రెస్, బీజేపీల పప్పులు ఉడకవని కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. లగచర్లలో తన అల్లుడి ఫ్యాక్టరీకి భూములు ఇవ్వనందుకే అక్కడి రైతులపై రేవంత్ అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారని, లగచర్ల లంబాడ సోదరుల కోసం ఢిల్లీ వరకు వెళ్లి కొట్లాడి బెయిల్ తెప్పించినట్లు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతామంటూ కొడంగల్ నియోజకవర్గంలోనే తిరుగుబాటు మొదలైందని, కడియం శ్రీహరికి దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని, అక్కడ బీఆర్ఎస్ బంపర్ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడిప్పుడే పరిస్థితిని అర్థం చేసుకుంటున్నారని, బీఆర్ఎస్‌కు ఓటు వేయనందుకు బాధపడుతున్నారని, రేవంత్‌ను చూసిన తర్వాతే కేసీఆర్ విలువ అర్థమవుతుందని అన్నారు. రైతుల ఖాతాల్లో టకీ టకీమని పైసలు పడతలేవు కానీ, ఢిల్లీలో ఉండే రాహుల్ గాంధీకి మాత్రం రేవంత్ టకీ టకీమని పైసలు పంపుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారని, పది నెలల కేసీఆర్ పాలనలో సంవత్సరానికి 41 వేల కోట్ల అప్పు చేసి సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని సంస్కరించామని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం కట్టామని, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీళ్లు ఇచ్చామని తెలిపారు. రైతుబంధు రూపంలో 73 వేల కోట్ల రూపాయలను 70 లక్షల రైతుల ఖాతాల్లో వేశామని, 28 వేల కోట్లతో రెండుసార్లు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశామని, జిల్లాకొక మెడికల్ కాలేజీ, వరంగల్లో అతిపెద్ద హాస్పిటల్, ఘన్పూర్‌లో కాళోజీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్, 200 గురుకుల పాఠశాలలను 1000కి పెంచామని వివరించారు. సంవత్సరానికి 40 వేల కోట్ల అప్పుతో ఈ కార్యక్రమాలు చేశామని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 నెలల్లో 1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క ప్రాజెక్ట్ కూడా ప్రారంభించలేదని, కొత్తగా ఒక్క ఇటుకైనా పేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్ రామ్ అవుతుందని కేసీఆర్ ముందే చెప్పారని, ఈ లక్షన్నర కోట్ల అప్పుతో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నారని విమర్శించారు. స్టేషన్ ఘన్పూర్‌లో రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ అద్భుతంగా పనిచేస్తోందని, సంస్థాగతంగా పార్టీని నిర్మించుకుందామని, తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీలేకుండా కొట్లాడేది కేసీఆర్, గులాబీ సైన్యమేనని పిలుపునిచ్చారు. పార్టీ రజతోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకుందామని కేటీఆర్ ప్రకటించారు

# సిపిఐ భూ పోరాటాలకు అండగా ఉంటా

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి**

**సంవత్సర కాలంగా కాపురం ఉంటున్న గుడిసె వాసుల పై రెవిన్యూ అధికారులు ఒత్తిడి ఆపాలి.**

బద్వేల్ నియోజకవర్గం లోని గోపవరం మండలం పి పి కుంట వద్ద గల సంవత్సర కాలంగా ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని అదేవిధంగా బద్వేల్ మండలం సి కొత్తపల్లి గ్రామ పొలంలో పేదలు చిన్నపాటి రేకుల షెడ్లు తీసుకొని నివసిస్తున్న పేదలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేస్తూ గుడిసెలను రూములను కూల్చివేస్తామని చెప్పడం హేయమైన చర్యని దీన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఔఆ విజయ జ్యోతి తెలిపారు మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో పి పి కుంట, సి కొత్తపల్లి జరుగుతున్న భూ పోరాటాలను ఐదు రోజులుగా చేస్తున్న దీక్ష శిబిరాలను ఆమెసందర్శించారు ఈ దీక్షలు ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ..... గోపవరం మండలం పి పి కుంట వద్ద సంవత్సర కాలంగా ఇండ్లు లేనినిరుపేదలు సర్వేనెంబర్ 15 61 నందు దాదాపు 400 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారని మౌలిక సౌకర్యాలైన కరెంటు నీళ్లు రోడ్లు లేకపోయిన చిమ్మ చీకట్లో పేదల బ్రతుకులు సాగిస్తూ ఉంటే అలాంటి వారిపై రెవెన్యూ పోలీస్ అధికారులు వాటిని కూల్చివేస్తామని హెచ్చరిక జారీ చేయడం సరికాదని వారి న్యాయబద్ధమైన సమస్యకు కాంగ్రెస్ పార్టీ అండదండగా ఉంటుందని ఆమె తెలిపారు అదే విధంగా సి కొత్తపల్లి గ్రామ పొలంలో 250 ఎకరాలు అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి కంచెలు వేసుకొని జామాయిల్




చెట్లు, జామ మామిడి చేసుకుని అనుభవిస్తూ ఉంటే కనీసం వాటిని స్వాధీనం చేసుకోకపోగా ఏ ఒక్కరి పైన ఒక కేసైనా కట్టినారా అని ఆ ప్రశ్నించారు పాలకులకు అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కబ్జాదారుల భరతం పట్టి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆమె కోరారు నిజమైనటువంటి ప్రజలకు అండగా దండగ ఉండేది కేవలం కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీ అని ఈ పేదల సమస్యలపై జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో పి.పి కుంట భూ పోరాట కన్వీనర్ పీ.వీ రమణ సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య మహిళా సమైక్య నాయకురాలు విజయమ్మ నాయకులు వెంకటయ్య ఓబులేసు గురయ్య ఓబులమ్మ లక్ష్మమ్మ సుబ్బరాయుడు శివ నరసింహ రామసుబ్బారెడ్డి నరసయ్య రవి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల దాడుల కమిటీ పునరుద్ధరణకి సహకరిస్తా

**కలెక్టర్ దివాకర**

**టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు 5 లక్షల ప్రమాద బీమా పత్రాలు అందజేత..**

**ములుగు, ఫిబ్రవరి 25 :** జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన కమిటీని త్వరలో పునరుద్ధరిస్తానని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ అంద చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పత్రాలను ములుగు జిల్లా సభ్యులకు ఈరోజు కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ నీ కలిసి జర్నలిస్టుల దాడుల కమిటీనీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరియు విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం పట్ల తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. టీ.ఎస్.జే.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు



గల సమస్యలను మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ నీ కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ములుగు జిల్లా అధ్యక్షులు చల్లగురుగుల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ రంజిత్, గౌరవ అధ్యక్షులు పడమటింటి నగేష్, ఉపాధ్యక్షుడు నగపురి హరినాథ్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల రాజు, ఈసీ మెంబర్ అనిల్ కుమార్, సంపంగి సాంబరాజు, గంద్రత్ విజయకుమార్, పెండెం భిక్షపతి, చల్లూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

**మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

**ఎస్పీ అఖిల్ మహజన్**



**వేములవాడ :** దక్షిణకాశీ క్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.. ఎస్పీ అఖిల్ మహజన్ పేర్కొన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు దర్శించుకుని, మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ అధికారులు పలు సూచనలు చేశారు. క్యూ లైన్లు, కోడె మొక్కు లైన్, ధర్మగుండం, ప్రధాన ద్వారం, ప్రసాదం తయారీ కేంద్రాన్ని, అంబేద్కర్ కూడలిని పరిశీలించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. పార్కింగ్ కు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహశీల్దార్ మహేష్, ఈఈ రాజేష్, సీఐ వీరప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ఆదివారం వనపర్తికీ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



వనపర్తి : వచ్చే నెల మార్చ్ 2వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి నియోజకవర్గానికి రానున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు మంగళవారం నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్యమంత్రి రాక సందర్భంగా వనపర్తిలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కి అందజేశారు. ముఖ్యమంత్రి రాకతో వనపర్తిలో దాదాపు 1000 కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నట్లు వారు పేర్కొన్నారు

## మార్చ్ 2 న శాంతివనంలో ఆరోగ్య రన్

**ఉప్పల్ :** ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యం కోసం ఒక రన్ ను నిర్వహిస్తాము అందులో భాగంగానే నారపల్లిలోని శాంతివనం పార్కులో మార్చి 2న ఆరోగ్య రన్ ను నిర్వహిస్తున్నట్లు రాచకొండ రన్నర్స్ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం చెంగిచెర్ల నందనవనం పార్కులో రన్ కు సంబంధించిన జెర్సీ టీ షర్ట్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాచకొండ రన్నర్ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ రన్ ను నిర్వహించడానికి ముఖ్య కారణం ఈస్ట్ హైదరాబాదులో ఎన్నో పార్కులు ఉన్నప్పటికీ వాటిని ఏ ఒక్కరూ ఉపయోగించుకొని వాకింగ్, రన్నింగ్ చేయకుండా ఇంటికే పరిమితం అవుతున్నారు. వెస్ట్ సైడ్ ఎలాంటి పార్కులు లేకపోయినప్పటికీ ఆరోగ్యం కోసం రోడ్లపై వాకింగ్ రన్నింగ్ చేస్తూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. మన బోడుప్పల్, పీర్జాదిగూడ లో ఉన్న పార్కులను ప్రతీ ఒక్కరూ ఉపయోగించుకొని రోజులో ఒక గంట వ్యాయామం కొరకు కేటాయిస్తే ఏలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ఈ రన్ లో పాల్గొనాలి. 500 రూపాయలతో ఈ రన్ కొరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి టీ షర్ట్, మెడల్, బ్రేక్ ఫాస్ట్, జ్యూట్ బ్యాగ్ తో ఉన్న కిట్ ను ఫిబ్రవరి 28 న, మార్చ్ 1 న పీర్జాదిగూడ లోని డెకథ్లాన్ వద్ద వీటిని అందిస్తామని తెలిపారు. మార్చ్ 2 న ఉదయం 5.30 కి ఆరోగ్య రన్ ప్రారంభమవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు తమ కుటుంబాలతో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాచకొండ అన్నారు సభ్యులు పాల్గొన్నారు.

## కాలేజీలో కీచకుడు

**రంగారెడ్డి :** రాజేంద్రనగర్ లో కీచకుడి వ్యవహారం బయటపడింది. ఒక డిగ్రీ విద్యార్థిని ప్రైవేట్స్ పార్ట్స్ తాకుతూ సుధీర్ అనే సూపర్వైజర్ నీచంగా ప్రవర్తించాడు. ఉప్పర్ పల్లి వీఎమ్ఎస్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఘటన. విషయం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు కీచకుడు సుధీర్ పై దాడిచేసి పొట్టు పొట్టున కొట్టారు. విద్యార్థినీల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తారా అంటూ యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేసారు. దేహ శుద్ధి చేసి కీచకుడిని పోలీసులకు అప్పగించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు బైకాట్

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారనగర్ లో నూతనంగా నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ కి వ్యతిరేకంగా రేపు జరగబోయే పట్టభద్రులు, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు మరియు జెఏసి నాయకులు స్వచ్ఛదంగా బైకాట్ చేశారు. గత ఇరవై రోజుల నుండి డంపింగ్ యార్డు నిలిపివేయాలంటూ ప్రతిరోజూ జెఏసి ఆధ్వర్యంలో నిరసనలు ధర్నాలు చేస్తున్నాం. అయినా మా ఆవేదనను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదంటూ జెఏసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను బైకాట్ చేస్తే ప్రభుత్వానికి మా ఆవేదన తెలుస్తోందని బావించి ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు జెఏసి నాయకులు తెలిపారు.

## సాంబ శివుని సన్నిధిలో కుంకుమ పూజలు

**జగిత్యాల :** మహా శివరాత్రి జాతర ఉత్సవాలలో భాగంగా బుగ్గారం లోని సంతాన సాఫల్య శ్రీ సాంబ శివ నాగేశ్వర ఆలయంలో మంగళ వారం మాతలచే కుంకుమ పూజలు, జంటలచే గీతా హవణ యజ్ఞం లు నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ మసర్థి రాజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ శ్రీహరి మౌన స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పలువురు వేద పండితులు మాతలచే కుంకుమ పూజలు చేయించారు. లోక కళ్యాణం కోసం మాతలు అత్యంత భక్తి శ్రద్ధలతో లక్ష్మీ దేవిని అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు. సామూహికంగా మంగళ హారతులు ఇచ్చి అమ్మవారికి అర్పించారు.

# ఈ లక్షణాలు... కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లే!

భారతదేశంలో కిడ్నీలో రాళ్ల సమస్య పెరుగుతోంది.. పెద్ద సంఖ్యలో ప్రజలు దీనికి బలైపోతున్నారు. మూత్రపిండాలు మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం.. దాని ప్రధాన విధి రక్తాన్ని ఫిల్టర్ చేయడం.. ఈ ప్రక్రియ జరిగినప్పుడు కాల్షియం, సోడియం, అనేక రకాల ఖనిజాల కణాలు మూత్ర నాళం ద్వారా మూత్రాశయానికి చేరుతాయి. భారతదేశంలో కిడ్నీలో రాళ్ల సమస్య పెరుగుతోంది.. పెద్ద సంఖ్యలో ప్రజలు దీనికి బలైపోతున్నారు. మూత్రపిండాలు మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం.. దాని ప్రధాన విధి రక్తాన్ని ఫిల్టర్ చేయడం.. ఈ ప్రక్రియ జరిగినప్పుడు కాల్షియం, సోడియం, అనేక రకాల ఖనిజాల కణాలు మూత్ర నాళం ద్వారా మూత్రాశయానికి చేరుతాయి. ఈ వస్తువుల పరిమాణం పెరగడం ప్రారంభమైన తరువాత అవి ఘనీభవించి రాయి ఆకారాన్ని తీసుకోవడం ప్రారంభిస్తాయి.. దీనిని రాళ్లుగా పిలుస్తారు. కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు తమ ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.. లేకుంటే కిడ్నీల్లో రాళ్ల ప్రమాదం మరింత పెరిగి.. అత్యవసర పరిస్థితికి దారితీసే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.
మూత్రపిండాల్లో రాళ్లతో బాధపడేవారు.. మూత్ర విసర్జన చేసేటప్పుడు నొప్పి, తరచుగా టాయిలెట్‌కు వెళ్లడం, కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, నడుము ప్రాంతంలో నొప్పి.. వికారం గురించి ఫిర్యాదు చేస్తారు.. అటువంటి పరిస్థితిలో అలాంటి వారు.. కొన్ని ఆహారాలకు దూరంగా ఉండటం ముఖ్యం.. డైటీషియన్‌ల ప్రకారం.. కిడ్నీల్లో రాళ్లు ఉన్న వారు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి.. లేకపోతే.. ఈ సమస్య మరింత పెరుగుతుంది.. మూత్రపిండాల్లో రాళ్ల సమస్యతో బాధపడే వారు ఎలాంటి ఆహారాలను తినకూడదో ఇప్పుడు తెలుసుకోండి. విటమిన్ సి ఆధారిత ఆహారాలు: రాళ్ల సమస్య ఉన్నట్లయితే, విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. దీని కారణంగా మరిన్ని రాళ్ళు ఏర్పడటం ప్రారంభిస్తాయి. నిమ్మ, పాలకూర, నారింజ, ఆవాలు, కివి, జామ వంటి వాటిని తినడం మానేయడం మంచిది.
ఉప్పు: మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు ఉప్పు, అత్యధిక ఉప్పు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం తగ్గించాలి. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సోడియం ఉంటుంది.. ఇది మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.



# టీలో దాల్చిన చెక్క కలిపి తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు



మీరు రోజూ టీ తాగే అలవాటు ఉన్నవారైతే ఇది మీకు ఉపయోగకరంగా ఉంటుంది. బాడీలో షుగర్ లెవెల్స్ నియంత్రించడం ముఖ్యమైనది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి లేదా వచ్చే అవకాశం ఉన్నవారికి.. టీ తాగడం ఆపేయడానికి కష్టమైతే దానిలో చిన్న మార్పు చేసి రక్తంలో షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. రోజూ టీతో పాటు చిటికెడు దాల్చిన చెక్క వేసినా ప్రయోజనాలుంటాయి అంటున్నారు నిపుణులు. దాల్చిన చెక్కలో బయోఆక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. అందులో ముఖ్యంగా సినామాల్డిహైడ్ అనే పదార్థం ఇన్సులిన్ పనితీరును మెరుగుపరిచే లక్షణాలను కలిగి ఉంటుంది. పరిశోధనల ప్రకారం దాల్చిన చెక్క ఇన్సులిన్ లాగా పనిచేసి గ్లూకోజ్‌ను కణాల్లోకి త్వరగా తీసుకువెళ్లేందుకు సహాయపడుతుంది. ఇన్సులిన్ ప్రతిస్పందనను మెరుగుపరిచేలా దాల్చిన చెక్క పనిచేస్తుంది. దీని వల్ల అధిక ఇన్సులిన్ అవసరం తగ్గుతుంది. ఇది ప్రత్యేకంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవారికి లేదా టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి సహాయపడుతుంది. టీ ముఖ్యంగా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి మెటబాలిజం మెరుగుపరచడంతో పాటు శరీరంలో వాపు తగ్గించడంలో సహాయపడతాయి. టీలో దాల్చిన చెక్క వేస్తే రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు పెరుగుతాయి. వీటి కలయిక ఇన్సులిన్ ప్రభావాన్ని మెరుగుపరిచేలా పని చేస్తుంది. షుగర్ శరీరంలో త్వరగా ప్రవేశించకుండా నియంత్రించడం వల్ల భోజనం తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలు స్థిరంగా ఉండేందుకు సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి భోజనం తర్వాత వచ్చే షుగర్ పెరుగుదలను నియంత్రించడం చాలా అవసరం. టీకి దాల్చిన చెక్క కలిపితే గ్లూకోజ్ శరీరంలో మెల్లగా ప్రవేశించేలా చేస్తుంది. దాంతో రక్తంలో షుగర్ స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రించవచ్చు. దీని వల్ల డయాబెటిస్ మందుల స్థానంలో దాల్చిన చెక్క పూర్తిగా ఉపయోగించలేనప్పటికీ దీన్ని ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం భాగంగా చేర్చుకోవచ్చు. కొన్ని అధ్యయనాలు చూపించిన ప్రకారం దీర్ఘకాలం దాల్చిన చెక్క తీసుకుంటే ఉపవాస సమయంలో బ్లడ్ షుగర్ స్థాయులు కొంతమేరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. టీలో దాల్చిన చెక్క కలపడం చాలా సులభం. మీరు చేసిన టీలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి బాగా కలిపితే సరిపోతుంది. రుచిని మరింత పెంచాలనుకుంటే టీ తయారయ్యేటప్పుడు దాల్చిన చెక్క కడ్డీని నేరుగా ఉంచి మరిగించవచ్చు. తీపి రుచిని పెంచాలని అనుకుంటే దాల్చిన చెక్కను అల్లం, లవంగం లాంటి సహజమైన పదార్థాలతో కలిపి ఉపయోగించవచ్చు. ఈ విధంగా రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

# సొరకాయతో పొరపాటున కూడా ఈ ఆహారాలను కలిపి తినకండి!



సొరకాయ మన ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే కూరగాయలలో ఒకటి. అయితే కొన్ని ఆహారాలను సొరకాయతో కలిపి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. మన ఆహారపు అలవాట్లలో కూరగాయలను భాగం చేసుకోవడం చాలా ముఖ్యమైంది. వివిధ రకాల కూరగాయలు శరీరానికి అవసరమైన నారులను, ఖనిజాలను, విటమిన్లను అందిస్తాయి. ఆ కూరగాయలలో సొరకాయ కూడా ఒకటి. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తుంది. సొరకాయలో నారులు ఎక్కువగా ఉంటాయి. ఈ నారాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మలబద్ధకం వంటి సమస్యలను నివారించడంలో కూడా సహాయపడతాయి. అంతేకాక సొరకాయ నీటిని అధికంగా కలిగి ఉండటంతో శరీరానికి తక్షణ శక్తి అందిస్తుంది. అంతేకాక ఇది అధిక రక్తపోటు ఉన్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సొరకాయతో కాలిఫ్లవర్ కలిపి తినడం మంచిది కాదు. ఈ రెండు కూరగాయలను ఒకే సమయంలో తీసుకుంటే జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి వీటిని కలిపి తినడం మానేయడం మంచిది. సొరకాయను కాకరకాయతో కలిపి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా ఈ రెండు కూరగాయలను కలిపి తింటే ఫుడ్ పాయిజన్ సమస్యలు రావచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఫలితంగా జీర్ణ సమస్యలు, పొట్ట నొప్పి వంటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం సొరకాయను పాలతో కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది కాదని చెబుతున్నారు. పాలు, సొరకాయ కలిపి తింటే శరీరంలో విభిన్న రకాల రసాయన చర్యలు జరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. ముఖ్యంగా జీర్ణ సంబంధిత సమస్యలు రావచ్చు. సొరకాయను నిమ్మరసంతో కలిపి తినడం వల్ల చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ రెండింటిని కలిపి తినడం వల్ల అలెర్జీ, తెల్లటి మచ్చలు, దురద వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి సొరకాయతో నిమ్మరసం కలిపి తినడం మానేయడం మంచిది.

# గుమ్మడి గింజలు కమ్మని నిద్ర



ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో గుమ్మడి గింజలు మొదటి స్థానంలో ఉంటాయి. త్వరగా బరువు తగ్గడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి కూడా ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. గుమ్మడి గింజలు చాలా పోషకమైనవి. వీటిని తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. నేటి కాలంలో అధిక మంది ఒబేసిటీతో బాధపడుతున్నారు. త్వరగా బరువు తగ్గడానికి వివిధ రకాల విత్తనాలను తింటుంటారు. వీటిలో చియా గింజలు, అవిసె గింజలు, జనపనార గింజలు, నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, గుమ్మడికాయ గింజలు ముఖ్యమైనవి. ఈ విత్తనాలు డైటింగ్, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి కూడా ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. వీటన్నింటిలో గుమ్మడి గింజలు చాలా పోషకమైనవి. వీటిని తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ విత్తనాలను రోజుకు ఒక టేబుల్ స్పూన్ తింటే శరీరానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఈ విత్తనాలు గుండె ఆరోగ్యం నుంచి మెదడు పనితీరు వరకు ప్రభావవంతంగా పనిచేస్తాయి. గుమ్మడికాయ గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె సక్రమంగా పనిచేయడానికి సహాయపడుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది సెరోటోనిన్, మెలటోనిన్ అనే శరీరం సహజ నిద్ర హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. రోజూ రాత్రి పడుకునే ముందు ఒక టేబుల్ స్పూన్ తినడం వల్ల మంచి నిద్ర వస్తుంది. ఇందులోని మెగ్నీషియం కండరాలు, నరాలను మరింత సడలిస్తుంది. ఈ విత్తనాల్లో జింక్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జ్ఞాపకశక్తిని పెంచడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా జింక్ నరాల సిగ్నలింగ్, మెదడు అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. గుమ్మడికాయ గింజల్లో జింక్, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. జింక్ గాయాలను నయం చేయడానికి, జలుబుతో పోరాడటానికి సహాయపడుతుంది.

## బిజినెస్

### ఎల్ఐసికి రూ.57 కోట్ల జిఎస్‌టి నోటీసు




దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)కు జిఎస్‌టి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం 2020-21గాను అదనపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)కి సంబంధించి రూ.57.2 కోట్ల డిమాండ్ నోటీసును ఇచ్చారు. ఇది ఢిల్లీ అసిస్టెంట్ కమీషనర్ నుండి తమకు అందిందని ఎల్ఐసి సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇందులో రూ.31.04 కోట్ల జిఎస్‌టి, రూ.23.13 కోట్ల వడ్డీ, రూ.3.10 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశాలు అందినట్లు వెల్లడించింది. ఇది తమ ఫైనాన్సియల్, నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఎల్ఐసి తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి కొత్త వ్యాపార ప్రీమియం 21 శాతం వృద్ధితో రూ.43,075 కోట్లకు చేరింది. సంస్థ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గి రూ.2,01,994 కోట్లుగా చోటు చేసుకుంది.

### కొత్త 'హాఫ్‌టైమ్' ప్రచారాన్ని ప్రారంభించి కోకా-కోలా




కోకాకోలా కొత్త గేమ్-ఛేంజింగ్ ప్రచారం "హాఫ్‌టైమ్" ను ప్రారంభిస్తోంది, ఇది జీవితంలోని చిన్న పాజ్‌లను గమనించేందుకు, రీసెట్ అయ్యేందుకు మరియు కొత్త ఉత్సాహంతో తిరిగి ప్రారంభించేందుకు అభిమానులను ప్రేరేపిస్తుంది. క్రీడలలో హాఫ్‌టైమ్ ఇచ్చే ఎనర్జీ, వ్యూహం, పునరుద్ధరణ భావనల ఆధారంగా రూపొందించబడిన ఈ ప్రచారం, ఒక సాధారణ పాజ్‌ను అర్థవంతమైన అనుభవంగా మారుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించిన, హాఫ్‌టైమ్ ప్రచారం స్టోరీ టెల్లింగ్, బ్రాండ్ సినిమాలు మరియు డిజిటల్ అనుభవాల వినూత్న సమ్మేళనంతో, ఒక సాధారణ విరామం కొత్త దృక్పథాన్ని ఎలా తెస్తుందో చూపిస్తుంది, మరియు ఇందులో భారతదేశం ముందంజలో ఉంది, ఇక్కడ మొదటి చిత్రం కోకాకోలా యొక్క సిప్ ఆ క్షణాలను ప్రత్యేకమైనవిగా ఎలా మారుస్తుందో హైలైట్ చేస్తుంది. త్వరిత రీఛార్జ్ కోసం మ్యాచ్ మధ్యలో తక్షణ రీఛార్జ్ కోసం విరామం తీసుకునే ఆటగాళ్లనుంచి, జీవితంలో ముందుకు సాగడానికి హాఫ్ టైమ్ అవసరమనే సందేశాన్ని ఈ ప్రచారం మనకు గుర్తు చేస్తుంది. ఎమీ ఢిల్లీ ద్వారా రూపొందించబడిన ప్రేరణ గీతానికి, అవార్డు గ్రహీత దిబాకర్ బెనర్జీ దర్శకత్వం వహించగా, స్నేహా ఖాన్వాల్కర్ సంగీతం, ఖుల్లార్ జి సాహిత్యం అందించడంతో ఈ అనుభవం మరింత చిరస్మరణీయంగా ఉంటుంది. ఈ గీతం రోజువారీ క్షణాలను నిజమైన మరియు సాపేక్షమైన అనుభూతిని కలిగించే విధంగా సంగ్రహిస్తుంది, హాఫ్‌టైమ్‌ను జీవితంలో సహజ భాగంగా చేస్తుంది. బబితా బరువా, సీఈఓ, ఎమీ ఇండియా, ఇలా వివరించారు, "కోకాకోలా ఎల్లప్పుడూ సంస్కృతిని నిర్వచించే ప్రచారాలను రూపొందించింది, హాఫ్‌టైమ్ ప్రచారంతో మేము అదే సాధించామని నమ్ముతున్నాము. దాని ప్రధాన అంతర్దృష్టి విశ్వవ్యాప్తమైనది, మరియు ఈ ప్రచారం భారతదేశం నుండి ప్రారంభమవుతుందనే విషయం మాకు ఎంతో గర్వంగా ఉంది."

# షేర్ మార్కెట్లలో ఆరని ట్రంప్ కుంపటి

# రూ.4 లక్షల కోట్ల సంపద ఆవిరి




ట్రంప్ టారిఫ్‌ల కుంపటి భారత స్టాక్ మార్కెట్లను మండేలా చేస్తూనే ఉంది. ఎఫ్ఐఐలు తరలిపోవడం, ఐటి, టెలికం, లోహ షేర్లలో ఒత్తిడితో సోమవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 856.65 పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 74,454కి దిగజారింది. రోజంతా నష్టాల్లోనే ట్రేడయింది. ఒక దశలో 900 పాయింట్లకు పైగా పడిపోయి 74,387 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం నష్టంతో 22,553 వద్ద ముగిసింది. ఇరు సూచీలు 2025లో ఇప్పటి వరకు 5 శాతం పతనమయ్యాయి. వరుస పతనంతో సెన్సెక్స్ ఎనిమిది నెలల కనిష్టానికి పడిపోయింది. ఒక్క పూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4.42 లక్షల కోట్లు ఆవిరై.. బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.422.98 లక్షల కోట్లకు పరిమితమైంది. "భారత్‌లో ఎన్నికలకు డబ్బులిస్తున్నాం. వారికి అవి అవసరం లేదు. వారు మనల్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఇండియా ఒకటి. మనపై 200శాతం సుంకాలు విధిస్తుంది." అని మరోమారు ట్రంప్ భారత్‌పై విరుచుకుపడటం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళనలను పెంచింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఆందోళనలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొనడంతో భారత మార్కెట్లపై ఆ ప్రభావం పడింది. మరోవైపు దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండటం, జిడిపి వృద్ధిపై ఆందోళనలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. గడిచిన శుక్రవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3,449 కోట్లకుపైగా విలువ చేసే షేర్లను విక్రయించారు. ఈ ఫిబ్రవరి నెల మొత్తంలో రూ.23,740 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. బిఎస్ఇలో స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.31 శాతం, 0.78 శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే మన దేశ కరెన్సీ రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి రూ.86.720 వద్ద ముగిసింది. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసిజి రంగాలు మినహా దాదాపు అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఐటి, టెలికం, లోహ రంగాల సూచీలు 2 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ సూచీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, టిసిఎస్ సహా టాటా స్టీల్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కొటాక్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

# బంగారం కొనుగోళ్లలో కొత్త ట్రెండ్

భారతదేశంలో బంగారం కొనుగోలు చేసే విధానం వేగంగా మారుతోంది. ఒకప్పుడు బంగారు ఆభరణాలు కొనడంపై ఎంతో ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ప్రజలు గోల్డ్ ఇటిఎఫ్, ఇతర ప్రత్యామ్నాయాలవైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా డేటా ప్రకారం, గోల్డ్ ఆభరణాలకు డిమాండ్ తగ్గుతూనే ఉంది. కానీ, బంగారు ఇటిఎఫ్‌లలో పెట్టుబడులు మాత్రం గణనీయంగా పెరుగుతున్నాయని వారు చెప్తున్నారు. భారతదేశంలో బంగారు ఆభరణాలకు డిమాండ్ గత మూడు సంవత్సరాలుగా క్రమంగా తగ్గుతోంది. 2021లో 610 టన్నుల బంగారం కొనుగోలు జరిగింది. ఇది 2022లో 600 టన్నులకు, 2023లో 575 టన్నులకు, ఇప్పుడు 2024లో 563 టన్నులకు పడిపోయిందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే 2022తో పోలిస్తే రికార్డు స్థాయిలో 7% తగ్గుదలను గమనించవచ్చు. దీనికి అతి పెద్ద కారణం బంగారం ధరలో భారీ పెరుగుదల. 2024లో బంగారం ధర 15% పెరిగింది. దీని వలన సామాన్యులకు నగలు కొనడం అనేది ఖరీదైనదిగా మారింది. అలాగే, మొత్తం ధరలో 10-25% వరకు మేకింగ్ ఛార్జీలు ఠారెత్తిస్తున్నాయి. ఇవి కూడా జనాలు వీటిపై అనాసక్తి చూపడానికి ప్రధాన కారకంగా మారుతున్నాయి. అదనంగా, కొత్త తరం ఇప్పుడు బంగారాన్ని కుటుంబ వారసత్వ సంపదగా కాకుండా పెట్టుబడి కోణం నుండి మాత్రమే చూడటం ప్రారంభించింది. బంగారు కడ్డీలు, కాయిన్ లకు డిమాండ్ పెద్దగా హెచ్చుతగ్గులకు గురికాలేదు. కానీ బంగారు ఇటిఎఫ్‌లతో పోలిస్తే అవి బలహీనపడుతున్నాయి. 2021లో 186 టన్నుల బంగారు కడ్డీలు, కాయిన్ల కొనుగోలు జరిగింది. ఇది 2022 నాటికి 173 టన్నులకు తగ్గింది. అయితే, 2023లో అది 185 టన్నులకు పెరిగింది. 2024లో అది 239 టన్నులకు చేరుకుంది. అయితే, ఇది స్వల్పకాలిక ధోరణి అని నిపుణులు భావిస్తున్నారు. దీనికి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా కారణమవుతున్నాయి. మొత్తానికి బంగారం ధరలు పెరుగుతు




న్నాయి. దీర్ఘకాలంలో, బంగారు ఆభరణాల కంటే ఇటిఎఫ్ లు ఎక్కువ లాభదాయకమైన ఒప్పందంగా భావిస్తున్నారు. బంగారంతో పోలిస్తే బంగారు ఇటిఎఫ్‌లు కొనడానికి, అమ్మడానికి సులభంగా, సౌకర్యవంతంగా ఉండటం వల్ల కూడా ఈ పెరుగుదల నమోదయ్యి ఉండవచ్చు. దీనిని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎప్పుడైనా అమ్మవచ్చు. ఇది చాలా ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. ముఖ్యంగా యువ పెట్టుబడిదారులకు ఇదొక మంచి ప్రత్యామ్నాయంగా కనపడుతోంది.

## స్పోర్ట్స్

# కేకేఆర్ కెప్టెన్‌గా నేను రెడీ!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2025 మెగా వేలంలో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాళ్ల జాబితాలో వెంకటేశ్ అయ్యర్ మూడో స్థానంలో ఉన్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున గతేడాది రాణించిన ఈ లెఫ్టాండర్ బ్యాటర్‌ను.. వేలంపాటకు ముందు ఫ్రాంఛైజీ వదిలేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో రూ. 2 కోట్ల కనీస ధరతో ఆక్షన్‌లోకి వచ్చిన అతడి కోసం కేకేఆర్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోటీపడ్డాయి.

ఈ క్రమంలో ఏకంగా రూ. 23.75 కోట్లకు కోల్‌కతా వెంకటేశ్ అయ్యర్‌ను తమ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ కెప్టెన్సీ రేసులో ఈ మధ్యప్రదేశ్ క్రికెటర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌కు పగ్గాలు అప్పగించేందుకు యాజమాన్యం సుముఖంగా ఉందనే వార్తలు వస్తున్నాయి.

**కెప్టెన్ అనే ట్యాగ్ అవసరం లేదు**

ఈ విషయంపై వెంకటేశ్ అయ్యర్ స్వయంగా స్పందించాడు. నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించేందుకు తాను సిద్ధంగా ఉన్నానంటూ మనసులోని మాటను వెల్లడించాడు. కెప్టెన్‌గా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. "కచ్చితంగా.. నేను వందశాతం సిద్ధంగా ఉన్నాను. నిజానికి కెప్టెన్సీ అనేది ఒక ట్యాగ్ మాత్రమే. నాయకుడిగా ఉండటం అనేది మాత్రం గొప్ప విషయం. డ్రెసింగ్‌రూమ్‌లో లీడర్ ఉండాలంటే కెప్టెన్ అనే ట్యాగ్ అవసరం లేదని నేను నమ్ముతాను. మన ప్రదర్శనతో సహచర ఆటగాళ్లకు స్ఫూర్తినివ్వాలి. మైదానం లోపలా, వెలుపలా రోల్ మోడల్‌లా ఉండాలి. మధ్యప్రదేశ్ జట్టులో నేను ప్రస్తుతం అదే పాత్ర పోషిస్తున్నాను.

**గళం విప్పే స్వేచ్ఛ ఉన్నపుడే**

మధ్యప్రదేశ్ జట్టుకు నేనేమీ కెప్టెన్‌ను కాదు. అయితే, నా అభిప్రాయాలకు, సూచనలకు అక్కడి నాయకత్వం విలువనిస్తుంది. నాకు అలాంటి వాతావరణం అంటే చాలా ఇష్టం. మనం జట్టులోకి కొత్తగా వచ్చామా.. మనల్ని వాళ్లు రూ. 20 లక్షలు లేదంటే రూ. 20 కోట్లు పెట్టి కొనుగోలు చేశారా అన్నది ముఖ్యం కాదు..

జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా మన గళం విప్పే స్వేచ్ఛ ఉన్నపుడే అంతా బాగుంటుంది" అని వెంకటేశ్ అయ్యర్ ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో చెప్పుకొచ్చాడు.

కాగా ఐపీఎల్-2021 సీజన్‌లో కేకేఆర్ తరఫున క్యాష్ రిచ్ లీగ్‌లో ఎంట్రీ ఇచ్చాడు వెంకటేశ్ అయ్యర్. మొదట కేకేఆర్ అతడిన రూ.20లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది. అయితే, ఆ ఎడిషన్‌లో అద్భుతంగా రాణించడంతో 2022 వేలానికి ముందు రూ. 8 కోట్లకు అయ్యర్‌ను రిటైన్ చేసుకుంది.

ఆ తర్వాత మరో రెండేళ్ల పాటు తమ జట్టుకే ప్రాతినిథ్యం వహించిన వెంకటేష్‌ను ఐపీఎల్-2025 వేలంలోకి విడిచిపెట్టి.. భారీ ధరకు తిరిగి జట్టులో చేర్చుకుంది. కాగా ఐపీఎల్‌లో వెంకటేష్ ఇప్పటివరకు ఆడిన 50 మ్యాచ్‌లలో 1326 పరుగులు చేశాడు.

**శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో**

ఇదిలా ఉంటే.. గతేడాది శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో కేకేఆర్ చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే, వేలానికి



ముందు అతడు జట్టును వీడగా.. పంజాబ్ కింగ్స్ ఏకంగా రూ. 26.75 కోట్లకు సొంతం చేసుకుంది. దీంతో కేకేఆర్ కెప్టెన్సీ పోస్టు ఖాళీ కాగా.. వెంకటేశ్ అయ్యర్‌తో పాటు అజింక్య రహానే కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మార్చి 22న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కేకేఆర్- ఆర్సీబీ మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్-2025 సీజన్‌కు తెరలేవనుంది.

### టాస్ పడకుండానే కీలక మ్యాచ్ రద్దు.. ఆసీస్‌కు ఇది నాలుగోసారి!

ఆస్ట్రేలియా- సౌతాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్ రద్దైంది. వర్షం కారణంగా కనీసం టాస్ కూడా పడకుండానే ఆట ముగిసిపోయింది. కాగా చాంపియన్స్ ట్రోఫీ-2025 లో భాగంగా గ్రూప్-'బి'లో ఉన్న ఆసీస్- ప్రొటిస్ జట్ల మధ్య మంగళవారం మ్యాచ్ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. రావల్పిండి వేదికగా జరగాల్సిన ఈ కీలక మ్యాచ్‌కు ఆది నుంచే వరణుడు అడ్డు తగిలాడు. దీంతో మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. కాస్త తెరిపినిచ్చినా మ్యాచ్ మొదలుపెట్టేందుకు సిద్ధం కాగా వర్షం మాత్రం ఆగలేదు. కాసేపు వాన ఆగినా.. కొద్దిసేపటి తర్వాత మళ్లీ చినుకులు పడ్డాయి. ఇలా ఆగుతూ, సాగుతూ దోబూచులాడిన వరణుడి కారణంగా ఆఖరికి అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్షం తగ్గకపోవడంతో.. మ్యాచ్ మొదలయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.



### పాక్ జట్టు.. అబ్బో ఘోరం : సీనియర్ల విమర్శలు



**ఇంటర్నెట్ డెస్క్:** స్వయంగా ప్రధానమంత్రే వచ్చి మనం భారత్‌పై గెలవాల్సిందే అని చెప్పినా పాక్ ఓడిపోవడంతో ఆ దేశ మాజీ క్రికెటర్లు భగ్గుమంటున్నారు. ఆ దేశ లెజెండరీ ఆల్‌రౌండర్ వసీం అక్రమ్ స్పందిస్తూ దేశ క్రికెట్‌లో భారీ మార్పులు అవసరమన్నాడు. పీసీబీ, సెలక్టర్ల పనితీరు తీవ్రంగా తప్పుపట్టాడు. ఆడలేకపోతున్న సీనియర్లను జట్టు నుంచి నిర్దాక్షిణ్యంగా తప్పించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్నాడు. పాక్ బౌలింగ్ ఘోరంగా ఉందని మండిపడ్డాడు. "గత ఐదు మ్యాచ్‌ల్లో మా బౌలర్లంతా 60 సగటుతో 24 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగారు. ఈ ఏడాది అమెరికా, ఒమన్ సహా వన్డేలు ఆడే 14 జట్లలో అత్యంత దారుణమైన బౌలింగ్ యావరేజీ ఉన్న రెండో జట్టు పాకిస్థానే. ఈ జట్టును చూసి పీసీబీ ఛైర్మనే నిరాశ చెందారు. అవసరమైతే మార్చాలని కోరాడంటే సెలక్షన్ ఎంత దారుణంగా ఉందో ఊహించుకోండి. ఆ సమయంలో వీరంతా కలిసి ఓ గంట సమావేశమై.. మళ్లీ అదే జట్టుతో వచ్చారు. ఓటమికి కెప్టెన్ కూడా బాధ్యత తీసుకోవాలి. పాక్ జట్టు 18 ఓవర్లు బౌలింగ్ చేయగానే పాక్ ఫ్యాన్స్ మైదానాన్ని వీడటం గమనించాను. దేశ చరిత్రలో ఇలాంటి దృశ్యాలు నేను చూడలేదు" అని వసీం అక్రమ్ మండిపడ్డాడు.

**ఇది రాజకీయ సెలక్షన్..**

పాక్ జట్టు సెలక్షన్ కమిటీని సీనియర్లు తప్పుపడుతున్నారు. తాజాగా అఫ్రిది స్పందిస్తూ.. ఒక రెగ్యులర్ ఓపెనర్‌ను పక్కనపెట్టి, ఒక స్పిన్నర్‌తో మెగా టోర్నీకి వెళ్లడమేంటని ప్రశ్నించారు. "గ్లోబల్ ఈవెంట్లకు వెళ్లే జట్టు సెలక్షన్ చాలా కీలకం. దీనిని చాలా ముందుగానే.. మెరుగ్గా నిర్వహించాలి. జట్టులోకి ఫహీమ్ అష్రాఫ్, కుష్‌దిల్ షా ఎంపిక పూర్తిగా రాజకీయం. ఉపఖండంలో స్పిన్నర్లు అవసరం. జట్టులో మరో స్పెషలిస్ట్ స్పిన్ బౌలర్‌ను ఎంపిక చేయాల్సింది" అని పేర్కొన్నారు.

**ఇదేం బ్యాటింగ్: ఇజాజ్ అహ్మద్**

పాక్ జట్టుపై మాజీ బ్యాటర్ ఇజాజ్ అహ్మద్ మండిపడ్డారు. కనీసం 50 ఓవర్లపాటు మైదానంలో నిలవలేని బ్యాటింగ్ ఉన్న జట్టు నుంచి విజయాన్ని ఏం ఆశిస్తామని ఎద్దేవా చేశాడు. తమ జట్టు బ్యాటర్లు నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కోలేరు. అలాగే సీమర్లను తట్టుకోలేరని పేర్కొన్నాడు.

**అదే నా బలహీనతైంది: విరాట్ కోహ్లి**

భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాక్ బ్యాటర్లు అమూల్యమైన పవర్‌ప్లే సహా తొలి 26 ఓవర్లలో చేయాల్సినంత నష్టం చేశారు. స్వేచ్ఛగా ఆడాల్సిన సమయంలో డాట్‌బాల్స్‌తో కాలయాపన చేశారు. తొలి 26 ఓవర్లలో పడిన 156 బంతుల్లో 100 డాట్‌బాల్స్ ఆడారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. భారత జట్టులోని అక్షర్, కుల్దీప్, హర్షిత్‌లు దాయాది బ్యాటర్లను బాగా కట్టడి చేశారు. స్వేచ్ఛగా ఆడే రిజ్వాన్ కూడా పరుగులకు అవస్థలు పడ్డాడంటే అర్థం చేసుకోవచ్చు.



## ఓటీటీలో 'మద్రాస్‌కారణ్' తెలుగు వర్షన్

మెగా డాటర్ నిహారిక కొణిదెల తమిళ సినిమా తెలుగులో ఓటీటీ వేదికగా విడుదల కానుంది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన కూడా వచ్చేసింది. సంక్రాంతి కానుకగా జనవరి 10న 'మద్రాస్‌కారణ్' చిత్రం కోలీవుడ్‌లో విడుదలైంది. ఈ మూవీలో షేన్ నిగమ్, కలైయరాసన్ హీరోలుగా నటించారు. థియేటర్లలోకి వచ్చి నెల రోజులు కూడా గడవకముందే తమిళ్ వర్షన్ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఇప్పుడు తెలుగు వర్షన్‌ను మేకర్స్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. వాలిమోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బి.జగదీష్ నిర్మించారు. తమిళ్‌లో ఈ సినిమాకు మిశ్రమ స్పందన లభించింది. విశాల్ మదగజరాజ మూవీ హిట్ టాక్ రావడంతో ఈ సినిమాకు కాస్త క్రేజ్ తగ్గింది. శివరాత్రి పండుగ కానుకగా ఫిబ్రవరి 26న 'ఆహా'లో 'మద్రాస్‌కారణ్' సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ కోసం సుమారు రూ. 5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. అయితే, కోటి లోపే వసూళ్లను రాబట్టడంతో నిర్మాతలకు భారీ నష్టాలను తెచ్చిపెట్టింది.

ఏడేళ్ల తర్వాత రొమాంటిక్ పాత్రతో రీఎంట్రీ

సుమారు ఏడేళ్ల తర్వాత 'మద్రాస్‌కారణ్' సినిమాతో తమిళ్‌లో నిహారిక రీఎంట్రీ ఇచ్చింది. 2018లో విజయ్ సేతుపతి నటించిన ఒక సినిమాతో ఆమె కోలీవుడ్‌కు పరిచయం అయింది. అయితే, ఆమెకు పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఇప్పుడు మద్రాస్‌కారణ్ మూవీలో మీరా అనే యువతిగా గ్లామర్ రోల్‌లో నిహారిక కనిపించింది. ఒక రొమాంటిక్ సాంగ్‌లో కూడా ఆమె నటించింది. ఈ పాటలో అటు రొమాన్స్, ఇటు డ్యాన్సులో నిహారిక రెచ్చిపోయిందని చెప్పొచ్చు. తెలుగులో సినిమాల్లో నటించింది కానీ ఈ తరహా యాక్టింగ్ మాత్రం ఎప్పుడూ చేయలేదు. ఇందులోని సాంగ్ చూసి మెగా ఫ్యాన్స్ స్టన్ అయిపోయారు. ఎందుకంటే రొమాన్స్ .. ఆ రేంజులో ఉంది మరి! ఈ సినిమాతో హీరోయిన్‌గా హిట్టు కొట్టాలని నిహారిక ప్లాన్ చేసుకుంది. కానీ, ఫలితం మరోలా వచ్చింది.



## అప్సర రాణి 'బ్లడ్ రోజస్' ఫస్ట్ లుక్ రిలీజ్

రంజిత్ రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా బ్లడ్ రోజస్. ఎంజిఆర్ దర్శకుడు. టీబీఆర్ సినీ క్రియేషన్స్ లో హరీష్ కె నిర్మాతగా వ్యవహరించారు. మహా శివరాత్రి సందర్భంగా చిత్ర ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. క్రైమ్ థ్రిల్లర్, యాక్షన్ కథతో ఈ సినిమాని తీశారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దాదాపు షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే జరిగింది.

## తెలుగు తెరపై మరో కొత్త హీరోయిన్

టాలీవుడ్ స్క్రీన్ కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. అందం, అభినయం కలగలిసిన బైరవి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతోంది. 'సర్కార్ నౌకరి' ఫేమ్, ప్రముఖ సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై చేస్తున్న ప్రొడక్షన్ నెంబర్ 1 మూవీలో హీరోయిన్‌గా బైరవి నటించింది. ఇది ఆమెకు డెబ్యూ మూవీ. సెంటిమెంట్, ఎమోషనల్ వంటి సీన్లలో బైరవి యాక్టింగ్ నెక్స్ట్ లెవల్ లో ఉండబోతున్నట్టు చిత్ర యూనిట్ చెబుతోంది. సినిమా విడుదల తర్వాత బైరవిని తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవడం ఖాయమని చెబుతున్నారు.శివ దర్శకత్వంలో, తాటి బాలకృష్ణ నిర్మాణంలో సీనియర్ నటీనటులు రఘుబాబు, పృధ్వి, ప్రభావతి తదితరులు నటించారు. ఈ సందర్భంగా నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ... "ఈ మూవీ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో రూపొందిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం. సర్కార్ నౌకరి ఫేమ్ ఆకాష్ హీరోగా నటించే ఈ సినిమా కోసం హీరోయిన్ గా బైరవి తెలుగు తెరకు తొలి పరిచయం చేస్తున్నాం. అచ్చమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలో బైరవి సరిగ్గా సరిపోతుంది. హీరోకి మరదలు పాత్ర చేస్తుంది. ఆమె పాత్ర సినిమాలో హైలైట్ గా ఉండబోతోంది. ఈ సినిమా ప్రతి ఒక్కరిని అలరిస్తుందని ఖచ్చితంగా చెప్పగలము. ప్రస్తుతం మా మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్నది. త్వరలోనే సినిమా టైటిల్, విడుదల తేదీ ప్రకటిస్తాం." అని అన్నారు.





## గ్రామీణ నేపథ్యంలో 'ప్రేమకు జై'

అనిల్ బురగాని, ఆర్.జ్వలిత జంటగా నటించిన చిత్రం 'ప్రేమకు జై'. మల్లం శ్రీనివాస్ దర్శకత్వంలో అనసూర్య నిర్మించిన ఈ చిత్రం మార్చిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శక%–%నిర్మాత సాయి వెంకట్ అతిథిగా హాజరై, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. మల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ%–%"గ్రామీణ నేపథ్యంలో ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశాం. హీరో అనిల్ బురగాని, హీరోయిన్ జ్వలిత చాలా బాగా చేశారు. ప్రతి ఒక్క ఆర్టిస్టు, టెక్నీషియన్స్ కృషి, సపోర్ట్ వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. క్వాలిటీ విషయంలో నిర్మాత ఎంతో సహకరించారు. 'ప్రేమకు జై' సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరుకుంటున్నాం." అని అన్నారు. కో ప్రోడ్యూసర్: మైలారం రాజు మాట్లాడుతూ.. యూత్ కు నచ్చే సబ్జెక్టును దర్శకుడు చాలా బాగా తెరకెక్కించారు. వచ్చే నెలలో థియేటర్లలో విడుదల కానున్న 'ప్రేమకు జై' సినిమాను చూసి ప్రతి ఒక్కరూ జై కొడతారని ఆశిస్తున్నాము." అని అన్నారు.

హీరోహీరోయిన్లు అనిల్ బురగాని, ఆర్ జ్వలిత మాట్లాడుతూ.. ఇంత మంచి సినిమాలో తమకు అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజతలు తెలిపారు. సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. 'ప్రేమకు జై' ప్రీరిలీజ్ వేడుకలో నటుడు అధిరే అభి, నిర్మాత ఎమ్ ఆర్ చౌదరి వడ్లపట్ల, నిర్మాత చందర్ గౌడ్, దర్శకుడు లారెన్స్ పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే నెలలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com